J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 51 24.05.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# ఫలితాలకు ముందే.. ప్రతీకారాలు!



## తీర్పు రాకముందే ఓర్పు కోల్పోయారు!



### ఆంధ్రలో భవిష్యత్తు రాజకీయాలకి అద్దం పడుతున్న అఘాయిత్యాలు





- ఓటరుపై శివాలెత్తిన అన్నాబత్తుని శివకుమార్
- పేట్రేగిపోయిన పల్నాడు
- గాడి తప్పిన తాడిపర్తి
- చెలరేగిన చంద్రగిరి
- పీక్స్‌కి చేరిన పిన్నెల్లి పిచ్చి

***హమ్మయ్యా!.. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగు శాతంలో రాష్ట్రం రికార్డు సాధించింది. తాము భయపడినంతగా ఈ ఎన్నికలలో అల్లర్లు, అరాచకాలు, అక్రమాలు జరగలేదు... అని, అధికారులు ఊపిరి పీల్చుకునేలోపే వాళ్ళ నెత్తిన పిడుగుపడింది. పోలింగ్ జరిగిన మరుసటి రోజే నేతల కొట్లాటకి ఆంధ్రప్రదేశ్ వేదికయ్యింది. వరుస సంఘటనలతో చెలరేగిన హింసతో, భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రం రావణకాష్టమే అన్న సంకేతాలు ఇచ్చినట్లుగా అయ్యింది.***

దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అల్లర్లకి, ఆగడాలకి, అరాచకాలకి ఉత్తర భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలు ప్రసిద్ధి. అలా చేయడం వారి ఆనవాయితీ. దక్షిణాది రాష్ట్రాలలో అలాంటి కుసంప్రదాయం లేదు. గ్రామస్థాయిలో జరిగే పంచాయతీ ఎన్నికలలో చిన్నస్థాయి వర్గ తగాదాలు జరుగుతాయి తప్ప వీధి పోరాటాలు, వీరోచిత ప్రదర్శనలు ఉండవు. తమిళనాడు లాంటి రాష్ట్రాలలో ఎన్నికలు ముగిశాక అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ప్రతీకార చర్యలు తీసుకుంటారు. అధికార పగ్గాలు చేపట్టినవారు అంతకముందు అధికారంలో ఉన్నవారికి చుక్కలు చూపించడం అక్కడ అనాదిగా వస్తున్న సంప్రదాయం.

## మారుతున్న తరంతో పాటు... మారుతున్న ఎన్నికల స్వరూపం!

పాత తరంలో ఎన్నికలంటే... గౌరవప్రదంగా జరిగే రాజ్యాంగ ప్రక్రియ మాత్రమే. వివిధ పార్టీల నుండి ప్రాతినిధ్యం వహించి పోటీచేసే అభ్యర్థులు హుందాగా వ్యవహరించేవారు. అతి సామాన్య కుటుంబాలనుండి వచ్చినవారే ఎక్కువగా ఉండేవారు. ఒకరికొకరు ఎదురుపడితే కరచాలనం చేసుకుని పరస్పరం పలకరించుకునేవారు. ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడిన తరువాత అన్ని పార్టీలవాళ్లూ స్నేహితులలాగా కలసిపోయేవారు. నిస్వార్థంగా తమ ప్రాంత అభివృద్ధి కోసం తమ తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు, అవసరాలూ తీర్చడం కోసం సమిష్టిగా కృషిచేసేవారు. మళ్ళీ ఎన్నికలు వచ్చేవరకు అవతలవాళ్ళు తమ ప్రత్యర్థులన్న భావనే లేకుండా వ్యవహరించేవారు.

నేటి తరంలో పరిస్థితి అలాలేదు. ఎన్నికలంటే ఆధిపత్యం కోసం పోరాడే రాజకీయ ప్రహసనంలా మారిపోయింది. పదవీ దాహంతో, అధికార వ్యామోహంతో వివిధ పార్టీల అభ్యర్థులుగా ఓవైపు కోటీశ్వరులు బరిలో దిగుతున్నారు. డబ్బుని మంచినీళ్లలా వెదజల్లి ఓటర్లని వేలం వేసి కొంటున్నారు. మరోవైపు రాజకీయ అనుభవం, ప్రజా సమస్యల పట్ల అవగాహన లేని ఆకురౌడీలు నయా నాయకులుగా అవతరించి ప్రజా క్షేత్రంలో పోటీచేసి పార్టీల గాలిలో గెలిచి చట్టసభలకి వెళ్తున్నారు. ఆ చట్ట సభలలో సైతం తమ సహజ నైజాన్ని ప్రదర్శించి బూతు పారాయణాన్ని వల్లిస్తున్నారు. అధికార మదంతో అడ్డంగా సంపాదించి రెండోసారి పోటీచేసే సమయానికి అంగబలం, అర్ధబలం సిద్ధం చేసుకుని చొక్కాలు మడిచి, తొడలు చరిచి మళ్ళీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. గడచిన ఐదేళ్లు అహంకారంతో విర్రవీగిన తాము మళ్ళీ గెలవకుంటే తమ భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళనతో అరాచకాలకి పాల్పడుతున్నారు. తమ గెలుపుపై ఏమాత్రం అనుమానం ఉన్నా అఘాయిత్యాలకు పూనుకుంటున్నారు. అక్షరాలా అలాంటి ఆగడాలే తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగాయి. తెనాలిలో పోలింగు రోజే సహనం కోల్పోయిన అధికారపార్టీ సిట్టింగ్ శాసనసభ్యుడు అన్నాబత్తుల శివకుమార్‌ని క్యూలైన్లో రమ్మన్నందుకు ఆయన శివాలెత్తి సాక్షాత్తు ఓటరుపైనే చేయిచేసుకున్నారు. చంద్రగిరి, తాడిపర్తి, మాచర్ల నియోజకవర్గాలలో ఎన్నికల అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి అనుచరులు పరస్పరం దాడులు చేసుకుని ఒకరినొకరు తరుముకున్నారు. మాచర్ల నియోజకవర్గంలో పోలింగు రోజునుండి మొదలైన దాడుల పరంపర మూడురోజుల పాటు కొనసాగింది. రక్తం ఏరులై పారింది. పల్నాడులో ప్రతీకార చర్యలు పరాకాష్టకి చేరాయి.

చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి పట్టణంలో చెలరేగిన హింస తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నానిపై

10లో



# ఎన్నికల ఫిర్యాదులకు నూరు శాతం పరిష్కారం

## ● మొత్తం అందిన ఫిర్యాదులు 5112.. పరిష్కరించినవి 5110

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అందిన వివిధ ఫిర్యాదులను నెల్లూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులు వేగంగా పరిష్కరించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఎన్నికల ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన వివిధ బృందాలు సమర్థవంతంగా పనిచేసి ఎప్పటికప్పుడు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయడం విశేషం. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఓటరు హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం, సి-విజల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, వెబ్ కంప్లయింట్స్ పరిష్కారానికి బృందాలను అధికారులు ఏర్పాటుచేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ రోజు వరకు ఓటరు హెల్ప్‌లైన్‌కు 1601 ఫిర్యాదులు, ఎన్‌జిఆర్‌ఎస్‌కు 1791, సి-విజల్‌కు 907, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సెల్‌కు 433, సోషల్ మీడియాకు 3, ఇతర ఫిర్యాదులు 336, వెబ్ కంప్లయింట్స్ 41 వచ్చాయి. మొత్తం 5112 ఫిర్యాదుల్లో, అన్ని ఫిర్యాదులను వివిధ బృందాల అధికారులు, సిబ్బంది త్వరితగతిన పరిష్కరించారు. మిగిలిన రెండు ఫిర్యాదులు కూడా పురోగతిలో ఉన్నాయి. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాల్సి వుండగా, సరాసరి 34 నిమిషాల్లోనే పరిష్కరించడం సిబ్బంది పనితీరుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులకు పంపించి పరిష్కరించడంలో ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపారు.

### నిరంతరం పర్యవేక్షించిన కలెక్టర్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించేందుకు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ సమర్థవంతంగా పనిచేసింది. కమాండ్ కంట్రోలు సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ నిరంతరం పర్యవేక్షించారు. వివిధ బృందాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆయన పలు సూచనలు చేశారు.



# ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం

రాష్ట్రంలో పోల్డ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు పటిష్టమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో స్ట్రాంగ్ రూములకు భద్రత, రక్షణ, కౌంటింగ్ కేంద్రాల సౌకర్యాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోల్డ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా ఎస్పీలు ప్రతిరోజు సందర్శించాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద లోపల మరియు బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్, జిల్లా ఎస్పీ అరిఫ్ హాఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, రెవెన్యూ డివిజనల్ అధికారి మలోల పాల్గొన్నారు.






# ఘరానా దొంగ దొరికాడు



## రూ.14.24లక్షల నగలు స్వాధీనం

తాళం వేసిన ఇళ్లను దోచుకునే ఘరానా దొంగ ఎట్టకేలకు పోలీసులకు దొరికాడు. ఇళ్లకు తాళం వేసి ఉండడాన్ని గమనించి, తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్నదంతా దోచుకుపోవడంలో సిద్ధహస్తుడైన పాత నేరస్తుడు చిక్కాడని నెల్లూరు నగర డీఎస్పీ ఇటీవల బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. స్థానిక జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉంటున్న ఎం.సునీల్ చెడు వ్యసనాలకు బానిసై చాలాకాలంగా ఇలాంటి దొంగతనాలకు అలవాటుపడ్డాడని, పలు కేసుల్లో జైలుకు వెళ్ళి వచ్చినా ఎలాంటి మార్పు రాలేదని, మళ్ళీ దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఆయన తెలిపారు. ఇటీవల నెల్లూరు అరవిందనగర్ ప్రాంతంలోని వేములపాటి శ్రీవల్లి ఇంట్లో చోరీకి పాల్పడి, తాళం వేసి ఉన్న ఆ ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగలగొట్టి 14.24 లక్షల రూపాయల విలువచేపే 44.5 సవర్ల బంగారు నగలు దోచుకువెళ్ళాడని, బాధితుల ఫిర్యాదుతో బాలాజీనగర్ పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించి, కేవలం రెండు రోజుల్లోనే అరెస్ట్ చేయడం జరిగిందని ఆయన వివరించారు. నిందితుని వద్ద నుంచి రూ. 14.24 లక్షల విలువ చేసే బంగారునగలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా నిందితుడిని అరెస్ట్ చేసిన బాలాజీ నగర్ సీఐ ఎల్ వీరానాయక్, ఏఎస్ఐ పి.శ్రీనివాసరాజు, హెడ్‌కానిస్టేబుళ్ళు కెవి సుధాకర్, సిహెచ్ శివకుమార్, సిహెచ్ రమేష్, పి.వెంకటేశ్వర్లు తదితరులను జిల్లా ఎస్పీ అభినందించినట్లు ఆయన తెలిపారు. ఇంటికి తాళం వేసి వేరే ఊళ్లకి వెళ్తున్నప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా పోలీసులు ఉచితంగా అందజేస్తున్న ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# నృసింహస్వామి సేవలో..సతీష్‌రెడ్డి



ప్రముఖ శాస్త్రవేత్త, డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ డా.జి. సతీష్‌రెడ్డి ఈనెల 22న పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో, స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ నిర్వాహకులు, అర్చకులు సాదరంగా స్వాగతించి స్వామి దర్శనం చేయించారు.

# వైభవోపేతంగా.. రంగనాథుని గరుడసేవ



నృసింహ జయంతిని పురస్కరించుకుని ఈనెల 22న నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం వైభవోపేతంగా బంగారు గరుడసేవ నిర్వహించారు. రంగనాయకులపేట వీధుల్లో స్వామివారు బంగారు గరుడవాహనంపై దర్శమివ్వడంతో భక్తులు తన్మయులై హారతులు సమర్పించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## నోరూరించే బెజవాడ బాలాజీ మిఠాయిలు...

# ఇక నెల్లూరులో కూడా!



నోరూరించే విజయవాడ వారి 'శ్రీ బాలాజీ ఫీ స్వీట్లు'.. ఇక నెల్లూరులో కూడా అందుబాటులోకి వచ్చేశాయి. నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో స్కేటింగ్ రింక్ ఎదురుగా, ఇటీవలే స్పందన ప్రసాద్ కుమార్తె స్పందన, స్వీట్ శ్రీనివాస్ కుమార్తె దీక్షితలు ఆ స్వీట్‌స్టాల్‌ను ప్రారంభించారు. ఇక్కడ నేతి మిఠాయిలు మంచి రుచిగా, శుచిగా ఉంటాయని, పెళ్ళిళ్ళు, విందులు వినోదాల వంటి శుభ కార్యాల్లో వీటిని కానుకలుగా కూడా ఇవ్వవచ్చని, గిఫ్ట్ హ్యాంపర్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, వెడ్డింగ్ కలెక్షన్.. ఇలా అన్నిరకాల స్వీట్లు, కేకులు సరస మైన ధరలకే లభిస్తాయని నిర్వాహకులు శ్రీనివాస్, గౌతమ్‌లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, పలువురు రాజకీయ నాయకులు కూడా పాల్గొని, స్వీట్ స్టాల్ నిర్వాహకులను అభినందించారు. విజయవాడ బాలాజీ మిఠాయిలంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన విషయం అందరికీ తెలిసిందే. అలాంటి స్వీట్లు ఇప్పుడు ఇక్కడ కూడా లభించడం నెల్లూరీయులకి ఆనందంగా ఉంది.

# ప్రైవేట్ పాఠశాలల సమస్యలు తీర్చండి

- డీఇఓకి 'అపుస్మా' నాయకుల వినతి



జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలవారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ 'అపుస్మా' (ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) సభ్యులు ఈనెల 22న జిల్లా విద్యాశాఖ అధికారి రామారావును కలిసి తమ కష్టాలను విన్నవించుకున్నారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ల విషయంలో రికార్డుషీట్‌లపై స్పష్టతనివ్వాలని కోరారు. ఒక పాఠశాలలో చదివిన విద్యార్థులు మరో పాఠశాలలో చేరే క్రమంలో టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) లేకుండా చేర్చుకోవడాన్ని నిలుపుదల చేసేలా అన్ని పాఠశాలలకు ఆదేశాలివ్వాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలవారికి తెలియకుండానే ఛైల్డ్‌ఇన్‌ఫోలో బకాయిలు ఉన్న విద్యార్థుల పేర్లను ఎంఇఓ కార్యాలయ సిబ్బంది తొలగిస్తున్నారని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లాలో ఇష్టారాజ్యంగా కార్పొరేట్‌స్కూళ్ళు, వాటికి శాఖలు ఏర్పాటు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని కోరారు. కొత్త సిలబస్ ప్రకారం 10వ తరగతి మోడల్ పేపర్లను ముందుగా తమకు అందజేయాలని, జిల్లా కామన్ పరీక్షాబోర్డు వారు అకడమిక్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అపుస్మా నాయకులు రవీంద్రరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటాద్రి తదితరులు పాల్గొని ఆమేరకు డీఇఓకు వినతిపత్రం సమర్పించారు.

# ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి

- నెల్లూరు నగర ఆర్‌ఓ వికాస్‌మర్మత్



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు జిల్లా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పటిష్టవంతంగా పూర్తిచేశారు. ఈనెల 22న నెల్లూరు నగర ఆర్‌ఓ వికాస్‌మర్మత్ కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను అనుసరిస్తూ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేశామని, కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ బాక్సులను జూన్ 3న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, భద్రతా సిబ్బంది ఆధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీకి తరలిస్తామని తెలిపారు. జూన్ 4వ తేది ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని, 8.30 గంటలకు ఈవిఎంలలోని ఓట్లను లెక్కించడం ప్రారంభమవుతుందని చెప్పారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు కౌంటింగ్ ప్రక్రియపై వారి ఏజెంట్లకు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. అధికారులు జారీచేసిన గుర్తింపు కార్డులను తీసుకుని వారు కౌంటింగ్ కేంద్రానికి రావాలని ఆయన సూచించారు.

## ఎన్‌బికెఆర్ కళాశాలలో...

# శిక్షణ పూర్తిచేసుకున్న నావెల్ విద్యార్థులు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న 2021-24కు బ్యాచ్‌కి చెందిన ఎన్‌సిసి నావెల్ వింగ్ విద్యార్థులు ఈనెల 21 నాటికి తమ నావెల్ శిక్షణను పూర్తిచేసుకున్నారు. అందరూ మంచిమార్కులతో 'సి' సర్టిఫికెట్‌ను సాధించారని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఆ విద్యార్థులు కళాశాలలో జరిగిన అన్ని సామాజిక కార్యక్రమాల్లో క్రమశిక్షణతో పాల్గొని విజయవంతం చేశారని నావెల్ ఎన్‌సిసి అధికారి సబ్ లెఫ్టినెంట్ డా. బి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్యాడెట్ కెప్టెన్ పెన్నా లోక్య, ఇ. భార్గవ్, శ్రీహరి, జోష్‌వర్ధన్‌లను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం, శిక్షణ పూర్తిచేసుకున్న ఆ బ్యాచ్ విద్యార్థులకు వారు ఘనంగా వీడ్కోలు పలికారు.



# జేవీవీ వేసవి శిబిరాలు

నెల్లూరులోని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ఈనెల 22న స్థానిక పీఎన్ఎం స్కూలు, మైపాడు గేటు వద్ద ఉన్న మునిసిపల్ స్కూళ్ళలో వేసవి శిబిరాలు ప్రారంభమయ్యాయి. జేవీవీ నాయకుడు డాక్టర్ శీనునాయక్ మాట్లాడుతూ, ఈ శిబిరాల్లో విద్యార్థులకు తెలుగుభాష తియ్యందనాన్ని, గణితశాస్త్రంలోని గమ్మత్తులను, ఇంకా ఆరోగ్యసూత్రాలు, సైన్స్ ప్రయోగాలు, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు.

# అక్కా..నేనూ వచ్చేస్తున్నా!

- ఆక్రోశిస్తూనే ఆగిపోయిన చెల్లెలి గుండె
- మృత్యువులోనూ వీడని బంధం



యమున



తులశి

వారిద్దరూ అక్కాచెల్లెళ్ళు. అక్కకి చెల్లెలు, చెల్లికి అక్క ఎంతో ప్రాణం. ఒకరినొకరు వదిలి ఉండలేనంత ఆత్మీయత. చివరికి మరణయాత్రలో కూడా ఒకరి వెనుకాలే మరొకరు వెళ్ళిపోయారు. మృత్యువు వీరిద్దరినీ విడదీయాలని చూసినా, అక్కాచెల్లెళ్ల అనుబంధాన్ని విడదీయలేకపోయింది. కేవలం గంటల వ్యవధిలోనే ఇద్దరూ ఒకరివెంట మరొకరు మృత్యు ఒడిలోకి చేరిపోయారు. ఈ విషాద సంఘటనతో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని పడారుపల్లికి చెందిన ఉదయగిరి మల్లికార్జున-యామినిలకు ముగ్గురు సంతానం. ముగ్గురూ కూతుర్లే. యమున (20), తులశి (19), యశస్విని(11). వీరిలో తులశి మానసిక వైకల్యంతో జన్మించడంతో వారికి ఒకరిపట్ల మరొకరికి ఎంతో ఇష్టం. ఈ నేపథ్యంలో ఇటీవల యమున అనారోగ్యం పాలై చెన్నైలో మరణించింది. ఇంటికి తీసుకువచ్చిన ఆమె మృతదేహాన్ని తులశి చూసి తట్టుకోలేకపోయింది. అక్క కోసం ఆక్రోశిస్తూనే..ఒక్కసారిగా గుండె ఆగి చనిపోయింది. దీంతో వారి తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. మొదటి బిడ్డ యమున, రెండవ బిడ్డ తులశి ఇలా హఠాత్తుగా మృత్యువాత పడడంతో వారి వేదన అంతా ఇంతా కాదు. ఈనెల 24న యమున పుట్టినరోజు కావడం, ఇంతలోనే ఆమె మరణించడంతో యమున స్నేహితురాళ్ళు పెద్దగా రోదించారు. కన్నీళ్ళతోనే కేకు కట్‌చేసి కడసారి వీడ్కోలు తెలిపారు. ఆ దృశ్యాలను చూసిన స్థానికులు కూడా కంటతడిపెట్టారు. ఈ దయనీయ సంఘటనతో పడారుపల్లి ఒక్కసారిగా కన్నబిడ్డలను కోల్పోయిన తల్లిగా.. కన్నీళ్ళపల్లిగా మారింది.




లాయర్
మే 24, 2024

# జీవనశైలి మార్పుతో విజృంభిస్తున్న వ్యాధులు

బాగా డబ్బున్నవాళ్ళు గొప్ప ధనవంతులన్నది పాత మాట. జబ్బులు లేకుండా ఉన్నవాళ్ళే గొప్పవాళ్ళన్నది..నేటి మాట. ఇప్పట్లో పరిస్థితి అలాగే ఉంది మరి!..ఇది కలికాలం అనేకంటే, రోగాల కాలం అనడమే సరైనదిలా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా నానా రకాల రోగాలే. ఏ జబ్బు లేని మనిషి ఉన్నాడా అంటే, దుర్భిణీ వేసి వెతకాల్సి వస్తోంది. పసిగుడ్డు దగ్గర నుంచి పండు ముసలివాళ్ళ దాకా ఏదో ఒక రకం జబ్బులు ఆవహిస్తూనే ఉన్నాయి. నేటి ఆధునిక కాలంలో జీవనశైలిలో పెనుమార్పులు రావడం అందుకు ప్రధాన కారణమంటున్నారు నిపుణులు. తినకూడనివన్నీ తినేయడం, తినాల్సినవి తినకపోవడం, అందుకు తగ్గట్టుగా లేనిపోని దురలవాట్లు..మొత్తంగా మనిషి జీవితం రోగాలపుట్టగా మారుతోంది. ఒకప్పుడు బాగా వయసొచ్చిన పెద్దవాళ్ళకి మధుమేహం, గుండెపోటు, రక్తపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, మెదడు సంబంధిత జబ్బులు వచ్చేవి. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేకుండా అన్నిరకాల వ్యాధులు చుట్టుముట్టేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అనారోగ్యాలు వందల నుంచి వేలసంఖ్యలోకి, దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలోకి వెళ్ళిపోతున్నాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్ లెక్కలు చూసినా, ఒక్క బ్రెయిన్‌స్ట్రోక్ కేసులే దాదాపు 30 శాతం దాకా చిన్నవయసులోనే..అంటే 20 ఏళ్ళ యువక ప్రాయం నుంచి నడిమి వయసు వచ్చేవారిదాకా వస్తున్నాయని, గత ఏడాది నుంచి ఇప్పటిదాకా సుమారు 40వేలకు పైగానే బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు వచ్చాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే, బ్రెయిన్ స్ట్రోక్‌తో ఏటా కోటి మందికి పైగానే ఆసుపత్రుల్లో చేరారని, వీరిలో కనీసం 50 లక్షల మంది దాకా ప్రాణాలు కోల్పోతుండగా, మిగిలినవారు వికలాంగులైపోతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాలు చెప్తున్నాయి. బీపీ, షుగర్‌లు పెరిగిపోతుండడం, వాటి నియంత్రణపై పెద్దగా శ్రద్ధ చూపకపోవడం, ఊబకాయం వంటివి బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి కారణాలుగా చెప్తున్నారు. మంచి ఆరోగ్యాన్నిచ్చే కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల వంటి పోషకాహారాన్ని వదిలేసి, రోడ్లమీద దొరికే జంక్‌ఫుడ్‌లు, పిజ్జాలు, బర్గర్లు వంటివి తినేయడం, సమతుల ఆహారం పట్ల అసలు ఆసక్తి చూపకపోవడం అనారోగ్యాలకు గురిచేస్తోంది. అంతేకాదు, ఎప్పుడూ ఏదో ఒక మానసిక వత్తిడితో ఉండడం, రోజూ కనీసం గంటపాటైనా వ్యాయామం లేకపోవడం, శరీరానికి విశ్రాంతినిస్తూ హాయిగా నిద్రపోవడం వంటివి లోపిస్తుండడం వల్ల బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి అనారోగ్యాలు ఆవహిస్తున్నాయి. ఉండే రోగాలు చాలవన్నట్టు పైపెచ్చు ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు లోనై ఆరోగ్యాన్ని పూర్తిస్థాయిలో పాడుచేసుకోవడం వల్ల వ్యాధుల బాధలు పెరిగిపోతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సహజసిద్ధమైన ఆహారాన్ని, సంప్రదాయబద్ధమైన వంటకాలను మానేసి, నేటికాలంలో ఎక్కడ చూసినా ఆధునికత పేరుతో రకరకాల కలుషిత పదార్థాలను, కల్తీ ఆహారాన్ని తినేయడం వల్ల అనేక రకాల రోగాలు విజృంభిస్తున్నాయి. రోజుకు కనీసం రెండు లీటర్ల నీళ్ళు తాగాల్సి ఉన్నా, శరీరానికి అత్యవసరమైన నీళ్ళు తాగడంలో కూడా ఎంతో మంది నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారంటే ఏమనుకోవాలి?..దాదాపుగా ఇవన్నీ స్వయంకృతాపరాధాలే. ఇదిలావుంటే, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా, మరోవైపు వాతావరణంలో వస్తున్న పెనుమార్పులు కూడా లేనిపోని జబ్బులకు దారితీస్తున్నాయని నిపుణుల పరిశోధనల్లో తేలింది. ఇటీవలి కాలంలో బాగా ఉష్ణోగ్రత పెరిగిపోవడం, భూమండలం కాస్తా అగ్నిగోళంగా మారడం, ప్రకృతిని-పర్యావరణాన్ని పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా వాటిని నాశనం చేయడం వంటి మానవ తప్పిదాల వల్ల పచ్చదనం లోపించి, కాలుష్య వాతావరణం పెరిగిపోతోంది. మండే ఎండల్లో ఆ వేడి వాతావరణానికి వచ్చే వడగాడ్పుల వల్ల పక్షవాతం బారిన పడుతున్నవారి సంఖ్య అత్యధికంగా ఉంటోందని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంకా, మూర్ఛవ్యాధి, అల్జీమర్స్ వంటి నరాల జబ్బులు కూడా వాతావరణ మార్పుల వల్ల వస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. దురలవాట్లకు బానిసలు కాకుండా, ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం పొంచివుంటుందని గుర్తించాలి. క్రమశిక్షణాయుతమైన జీవనశైలిని, మంచి ఆహారపుటలవాట్లను కలిగి ఉండాలని, మనకు మనమే ఏది మంచో-ఏది చెడో గ్రహించి సమతుల ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, లేకుంటే చిన్నవయసు నుంచే రోగాలతో నానా యాతనలు పడాల్సివస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా, వ్యాధులు వచ్చాక బాధలు పడేకంటే, అవి రాకముందే మేల్కోవడం ఎంతైనా శ్రేయస్కరం కదా!..

# నోట్ల జాతర.. విలువలకి పాతర!

రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నేతలను ఎన్నుకుంటాం అని గర్వంగా చెప్పుకునే భారతదేశ నేతలకి, ఓటేసే ప్రజలకి ఇకపై అలా చెప్పుకునే అర్హతలేదు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను గమనిస్తే ఎన్నికల తంతు ఎంత అధ్వాన్నంగా మారిందో అర్థమైపోతుంది. స్వార్థపూరిత నాయకులు, వారిని చట్టసభలకి ఎన్నుకునే క్రమంలో తమని తాము అమ్ముకునే స్థాయికి దిగజారిన ఓటర్లు, ఎన్నికల ప్రక్రియని వ్యాపారబద్ధంగా మార్చి, ధనస్వామ్య ప్రహసనంగా మార్చేశారని తేటతెల్లమైపోయింది. ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా జరిగిన తనిఖీలలో రాజకీయపార్టీలు తరలిస్తున్న కొన్ని వేలకోట్ల రూపాయల అక్రమ సొమ్ముని అధికారులు పట్టుకున్నారంటే ఇక దేశం మొత్తంమీద ఎన్ని లక్షల కోట్లు చేతులు మారాయో ఊహించుకోవడం కూడా కష్టమే. కొన్ని ప్రాంతాల్లో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనే అభ్యర్థులు వంద కోట్లకి మించి డబ్బు ఖర్చుపెట్టారంటే ఓట్ల కోసం ఏ స్థాయిలో నోట్లు వెదజల్లారో అర్థమవుతుంది. మొత్తంమీద అయిదేళ్లకి ఒకసారి వచ్చే ఓట్ల పండుగలో విలువలకి పాతరవేసి ఎన్నికలని నోట్ల జాతరగా మార్చేయడం మంచి సంప్రదాయం కాదు. నేతలది అధికార దాహం... ఓటర్లది అవకాశవాదం! *- యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.*




lawyerpatrika@gmail.com
+91 98663 14741

# మురుగుదిబ్బగా..ఏకేనగర్ ఇండస్ట్రియల్ ఏరియా

నెల్లూరులోని ఏకేనగర్ ఇండస్ట్రియల్ ఏరియా మురుగుదిబ్బగా మారింది. పరిశ్రమలతో విలసిల్లాల్సిన ఈ ప్రాంతం ఎవరూ పట్టించుకోకపోవడంతో చివరికి చెత్తకుప్పలకు నిలయమైంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్లు ఉన్నాయన్న మాటేగానీ, ముళ్ళచెట్లతో నిండిపోయి ఉన్నాయి. రోడ్ల పక్కలంతా భారీఎత్తున చెత్త నిండిపోయి, రోడ్లంతా గబ్బుకొట్టిపోతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది అప్పుడప్పుడూ శుభ్రం చేస్తున్నా, మళ్ళీ మరుసటి రోజుకల్లా ఎక్కడెక్కడి చెత్తంతా ఇక్కడికే వచ్చి చేరుతోంది. రాత్రివేళల్లో వీధులన్నీ చీకటిగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలు కూడా జోరుగా సాగుతున్నాయని.. ఈ ఏరియాలో తిరగాలంటే ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విద్యుత్ దీపాలు కూడా సరిగా వెలగడం లేదు. కార్పొరేషన్ అధికారులు ఒకసారి ఈ ప్రాంతాన్ని పరిశీలించి, పరిశుభ్రం చేయించి, ఈ ఏరియాను బాగుచేయాలని ప్రార్థన.

*కె. అంజయ్య, నెల్లూరు.*




# భద్రత లోపిస్తే.. విహారయాత్రల్లో విషాదమే!

వేసవికాలం సెలవుల కాలం కనుక, విద్యార్థులకు-చిన్నారులకు విహారయాత్రలపై మోజు పెరుగుతుండడం సహజం. అందులోనూ సెలవులు వచ్చినా ఇళ్ళవద్దనే మగ్గిపోవడమంటే పిల్లలకే కాదు, అనేకమందికి పెద్దలకు కూడా చిరాకే. ఎప్పుడెప్పుడు సెలవులు వస్తాయా?..పిల్లలను తీసుకుని హాయిగా ఎక్కడికైనా యాత్రకు వెళ్దాం అనుకునేవారు ఎందరో ఉంటారు. ఈ వేసవి సెలవుల్లో పిల్లలతో పాటు గడిపే మంచి అవకాశం తల్లితండ్రులకు ఉంటుంది కనుక, తాము ఇష్టపడిన ప్రాంతాలకు పిల్లలను తీసుకువెళ్తుంటారు. పిల్లలూ అందుకు సిద్ధంగానే ఉంటారు. విద్యార్థులను విహారయాత్రలకు తీసుకువెళ్ళి, తద్వారా వారికి విజ్ఞానాన్ని కూడా కలుగజేసే పాఠశాలలు ఇప్పుడు అరుదుగానే ఉంటున్నాయి. ఏవో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు మాత్రం అలాంటి యాత్రలను ధైర్యంగా ప్రోత్సహిస్తున్నాయి కానీ, పిల్లలను ఎక్కడో దూరప్రాంతాలకి తీసుకువెళ్లడం, తిరిగి క్షేమంగా ఇళ్లకు తీసుకురావడం అన్నది ఇప్పుడు ఓ పెద్ద సాహసోపేతమైన కార్యక్రమంగా తయారుకావడంతో క్రమేణా ఈ యాత్రలకు తిలోదకాలిచ్చేస్తున్నారు. విహారయాత్రల్లో తమ పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందోననే అనుమానంతో తల్లితండ్రులు కూడా తమ పిల్లలను యాత్రలకు పంపడానికి జంకుతున్నారు. తమ పిల్లలను ఒక్కరోజు కూడా విడిచివుండలేని తల్లితండ్రులు మరింతమంది. అయితే, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులు, క్రమశిక్షణకు పెద్దపీట వేసే యాజమాన్యాలు, విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకునే పర్యవేక్షకులు ఉంటే విహారయాత్రలు.. విద్యార్థులకు విజ్ఞానయాత్రలుగా ఉంటాయి. కానీ, రానురాను ఇప్పుడలాంటివి కనుమరుగవుతుండడంతో ఎవరికి వారే స్వయంగా వెళ్లడం అలవాటు చేసుకుంటున్నారు.

## ఏమరుపాటుగా ఉంటే ప్రమాదం తప్పదు :

ఏ ఒక్క జిల్లాలోనో, రాష్ట్రంలో మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విహారయాత్రల్లో ప్రతిఏటా ఎక్కువగా జలగండాలే అధికంగా ఉంటున్నాయి. కాలువలు, బావులు, చెరువులు దొరువులు, జలపాతాలు, నదీనదాలు, సముద్రతీరాల్లో ప్రమాదాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఆయా ప్రాంతాలు ఎంతో ఆహ్లాదంగా ఉండడంతో పర్యాటకులు ఆకర్షితులవుతుంటారు. తల్లితండ్రులు, లేదా పర్యాటకులు వీటిపట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలి. తమ పిల్లలను ఏ బీచ్‌కో, లేదా కొండకోనల్లో ఉన్న జలపాతాల వద్దకో తీసుకువెళ్లినప్పుడు, ముందుగా అక్కడ భద్రత ఎలా ఉందో గమనించాలి. కన్నుమూసి తెరిచేలోగా ప్రమాదం జరిగిపోయే ప్రాంతాలెన్నో ఉంటాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదు. ముఖ్యంగా, సముద్రస్నానాలకి వెళ్లినప్పుడు, నదుల్లో కాలువల్లో మునిగేటప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. బీచ్‌ల వద్ద, జలపాతాల వద్ద జనం కిటకిటలాడుతున్నప్పుడు తమ పిల్లల పట్ల ఏమరుపాటు జరిగితే, వారు తప్పిపోవడమో లేదా తొక్కిసలాటలకు గురికావడమో జరిగే ప్రమాదం ఎంతైనా ఉంటుంది. అదేవిధంగా, పడవ ప్రయాణాలు, బోటు షికార్లకు కూడా భద్రత లేకుండా దిగడం మంచిది కాదు. ఎక్కడికి వెళ్లినా భద్రత ముఖ్యం. కాలువల్లో పెద్దపెద్ద గుంతలుంటాయి. చిన్నారులు ఈ వేసవిలో ఎక్కడంటే అక్కడ ఈతకు దిగితే ప్రమాదమే. కొత్త ప్రాంతాల్లో వారికి ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. నీళ్లలో దిగాలంటే భలే సరదాగా ఉంటుంది. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను వదిలిపెట్టేస్తే చాలా ప్రమాదం. జరగరాని ఘటనలు జరిగిపోయాక ఎంత ఏడ్చినా ప్రయోజనం ఉండదు కనుక, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి.

## పర్యాటక ప్రాంతాల్లో భద్రత పటిష్టంగా ఉండాలి

మన దురదృష్టమేమంటే..మన జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగా కూడా అనేక పర్యాటక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో భద్రత ఉండదు. పర్యాటకులకు సరైన వసతులు అసలుండవు. ప్రభుత్వాలు, ఆయా ప్రాంతాల్లోని అధికారగణాలు ఇకనైనా కళ్ళు తెరచి, పర్యాటక ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. ఏ వాగువంకల్లో ఎక్కడ సుడిగుండాలున్నాయో గుర్తించి, అక్కడంతా దిగకూడదని హెచ్చరికల బోర్డులు పెట్టాలి. సముద్ర తీరప్రాంతాల్లో మెరైన్ పోలీసులను మరింత ఎక్కువ సంఖ్యలో నియమించి ప్రమాదాలు జరగకుండా చూడాలి. బోట్లు-పడవలు మునకకు గురికాకుండా, అవి సరిగ్గా ఉన్నాయో లేదా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తుండాలి. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలి. తమ పరిధిలోని పర్యాటక ప్రాంతాల్లో ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది, పోలీసు యంత్రాంగం కృషి చేయాలి. ఎక్కడ ప్రమాదం పొంచివుంటుందో తగు భద్రతలు తెలియజెప్పే 'గైడ్'లను కూడా ఏర్పాటు చేయడం అవసరం. ఏదేమైనా..పిల్లలు, పెద్దలు, కుటుంబాలతో సహా అందరూ కలసి సంతోషంగా చేసే విహారయాత్రలు, చివరికి విషాద యాత్రలుగా మిగలకుండా చూడడం అందరి మానవీయ కర్తవ్యం. అదేవిధంగా పర్యాటక ప్రాంతాల్లో ఉన్న స్వచ్ఛంధసంస్థల వారు, స్థానిక ప్రముఖులు, సమాజసేవకులు కూడా పర్యాటకులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటే, పర్యాటకులకు కొంత భరోసా ఇచ్చినట్లవుతుంది. ఎక్కడెక్కడినుంచో వచ్చే పర్యాటకులను ఆత్మీయులుగా భావించి, స్థానికులు వారికి సేవాభావంతో తగు తోడ్పాటునందిస్తే ఎంతో మేలుచేసినట్లవుతుంది.

*- రాజశ్రీ*

# పుచ్చలపల్లికి సీపీఎం నాయకుల నివాళి



పేదప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన భారత కమ్యూనిస్టుపార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం నాయకులు ప్రస్తుతించారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఈనెల 19న నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, దయాకర్ తదితరులు పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమసమాజ స్థాపన కోసం నిరంతరం శ్రమిస్తూ, పేదల పక్షాన ఆయన జీవితాంతం పోరాటం చేశారని, ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని వీరోచితంగా పోరాడారని, ఆ మహనీయుని ఆశయాల బాటలో అందరూ నడవాలని వారు ఆకాంక్షించారు.

# రాఘవేంద్రస్వామికి లక్ష మల్లెలతో పూజ



నెల్లూరు మండపాల వీధిలో కొలువైవున్న గురు రాఘవేంద్రస్వామి మందిరంలో అర్చకులు ఈనెల 19న స్వామివారికి లక్ష మల్లెలతో విశేషపూజలు నిర్వహించారు. ఆనం జయకుమార్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మందిరం ట్రస్టీ నందగిరి గురుచరణ్ పర్యవేక్షించారు.

# ఉత్తమ వైద్యులకు సన్మానాలు



బోగోలు మండలంలో వైద్యరంగంలో ఉంటూ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న పలువురు వైద్యులను బిట్రగుంటలోని వాకర్స్ అసోసియేషన్ వారు ఇటీవల ఘనంగా సన్మానించారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు వారికి శాలువాలు కప్పి అభినందించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయేంద్ర, డాక్టర్ ఆనందసాగర్, డాక్టర్ వైవి చలపతిరావు తదితరులను ఆత్మీయంగా సత్కరించారు.

# శ్రీ ఆదిశంకరాచార్యుల సంస్మరణ వారోత్సవాలు



జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల వారి సంస్మరణ వారోత్సవాలు నెల్లూరులోని చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. నెల్లూరు పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో ఉదయం 9 గంటల నుండి తిరుపతి వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి శ్రీ రామలాలశర్మ 'చతుస్సూత్రి భాష్య ప్రవచనం' ప్రారంభించారు. తొలుత, మహన్యాసపూర్వక రుద్రాభిషేక అర్చనలు శంకర భగవత్పాదులకు షోడశోపచార పూజలు చేశారు. చతుర్విధ పురుషార్థాలలో ముఖ్యమైనది మోక్షమేనని, దానికి కారణమైనది బ్రహ్మజ్ఞానమని, దానికోసం బ్రహ్మ విచారము బ్రహ్మసూత్ర విచార రూపంగా చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. సాయంత్రం 6 గంటలకు 'దశ శ్లోకీ విచారః' అనే విషయంపై ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. స్వామి సమయానంద నాథ తదితరులు పర్యవేక్షించారు. చక్రాల వారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యానమందిర కమిటీ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, కప్పర గిరిజాలక్ష్మి, మల్లవరపు లక్ష్మీ నరసింహారావు, అన్నవరం సత్యనారాయణ, టి.లక్ష్మీనారాయణ, పవని అనిల్‌కుమార్‌శర్మ, స్వయంపాకుల సుబ్రహ్మణ్యశర్మ, కాళిదాసు విజయశేఖర్, తంగిరాల వెంకట శ్రీకాంత్‌శర్మ, ములుముడి ఉదయ్‌కుమార్ శర్మ, ఒంగోలు సుధాకర్, గన్నవరం ప్రభాకరశర్మ తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం కార్యక్రమాలను నిర్వహించారు.

# 28 నుంచి.. జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు

## • ఏర్పాట్లను సమీక్షించిన ఆర్డీఓ మలోల





జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో మే 28 నుంచి జూన్ 7వ తేదీవరకు అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, దేవస్థానం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారి మలోల ఈనెల 21న అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు మౌలిక సదుపాయాలకు లోటులేకుండా చూడాలని, విద్యుత్ అంతరాయాలు లేకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని, వైద్యసేవలు అందుబాటులో ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. తొలుత బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను, కరపత్రాలను ఆయన ఆలయ ఇఓ గిరికృష్ణతో కలసి ఆవిష్కరించారు. దేవాదాయశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ చలివేంద్రం



నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో స్టేడియంకు వచ్చే క్రీడాకారులకు, పాదచారుల కోసం ఈనెల 22న మంచినీళ్లు, మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వాకర్స్-203 గవర్నర్ పలగాటి శ్రీనివాసులరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించగా, ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షులు బిరదవోలు రామ మోహన్‌రెడ్డి 600 మజ్జిగ ప్యాకెట్లను తన వితరణగా అందజేశారు. సుమారు నెలరోజుల పాటు ఈ చలివేంద్రాన్ని నిర్వహించాలని వాకర్స్ సంఘం వారు కృషిచేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి షేక్ నజీర్ అహమ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, పత్తిపాటి రమణయ్య, కొండూరు సుబ్బారావు, మారుతీరావు, హరిబాబు, పులగల సుబ్బారావు, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నరసింహకొండపై..

# రెడ్‌క్రాస్ ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు రూరల్ మండలంలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నరసింహకొండపై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి అనేకమంది భక్తులకు వైద్యసేవలందించారు. రెడ్ క్రాస్ ఏ.ఆర్.వి. క్లినిక్ వైద్యుడు వి.రమణయ్య ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఈ వైద్య శిబిరానికి వచ్చిన భక్తులకు నెల్లూరు కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న రెడ్ క్రాస్ జనరిక్ మెడికల్ షాప్‌లో అతి తక్కువ ధరలకు మందులను అందించడం జరుగుతుందని చెప్పారు. నరసింహకొండపై అంబులెన్స్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, అవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వలంటీర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొని భక్తులకు సేవలందించారు.

# టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఈనెల 21న కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) లవన్న అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూన్ 3 వరకు పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాల్లో 7083 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. అదే విధంగా, ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను జిల్లాలో 51 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నామని తెలిపారు. 20298 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు, 5,592 మంది ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులు మొత్తం 25,890 మంది విద్యార్థులు ఈ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్ష సమయానికి నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా వారికి అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. పరీక్షకేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఎక్కడా కూడా జెరాక్స్ కేంద్రాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని డిఆర్ఓ సూచించారు.

## ఏపీ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు...

జూన్ ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు డిఆర్వో లవన్న ఈ సందర్భంగా తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. 3 కేంద్రాల్లో టెన్త్, 4 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు.

# సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'



జిల్లా పోలీసు అధికారులు 'మొబైల్ హంట్' విధానంతో, ఎవరైనా పోగొట్టుకున్న ఫోన్లను వెతికి పట్టుకుంటున్నారు. పెద్దఎత్తున ఫోన్లను రికవరీ చేసి, వాటిని సొంతదారులకు అందిస్తున్నారు. దీంతో జిల్లా పోలీసులు ప్రజలకు చేరువగా ఉంటూ సేవలందించడం అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఈనెల 21న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఈ విధానం గురించి మాట్లాడుతూ, 'మొబైల్ హంట్'తో దాదాపు 1.50 కోట్ల రూపాయల విలువచేసే 600 ఫోన్లను రికవరీ చేశామని చెప్పారు. వాటిని సొంతదారులకు అందజేస్తున్నామన్నారు. పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్లను గుర్తించి అప్పగిస్తున్న జిల్లా ఎస్పీకి, సైబర్‌క్రైమ్ పోలీసులకు బాధితులు తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సిహెచ్ సౌజన్య, సైబర్‌క్రైమ్ ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కన్యకా పరమేశ్వరి నగరోత్సవం



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వెలసివున్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, విశేషపూజలు పెద్దఎత్తున జరిగాయి. అనంతరం అమ్మవారి నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

# జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మే 20న నెల్లూరులో ఆయన అభిమానులు వేడుకలు నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు సింగంశెట్టి రవిచంద్ర ఆధ్వర్యంలో నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అభిమానులతో కలసి కేకు కట్‌చేసి అందరికీ పంచారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అనుదీప్, కిరణ్‌తేజ, వెంకీ, బబ్లూ, ధీరజ్, నిఖిల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి

# హుండీ ఆదాయం రూ.16.39 లక్షలు



నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 21న హుండీలను లెక్కించారు. 62 రోజుల్లో భక్తులు హుండీలో అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 16,39,705 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి జె. శ్రీనివాస్ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

# డీఆర్‌డీఏ ఉద్యోగుల మానవీయ సాయం



డీఆర్‌డీఏలో ఎంఎస్ సీసీగా పని చేస్తున్న సిద్ధివాణి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో, ఆమె కుటుంబానికి ఆదుకునేందుకు డీఆర్‌డీఏ ఉద్యోగులందరూ ఒకనెల వేతనం మొత్తం 4,67,354 రూపాయలను సహాయంగా అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈనెల 21న ఆ చెక్కును డిఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ రాజు చేతులమీదుగా వాణి కుటుంబసభ్యులకు అందజేశారు. డీఆర్‌డీఏ జేఏసీ నాయకులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# సాయిదర్బార్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరం–శ్రీ సాయిమాత నిత్యాన్నప్రసాదాలయంలో ఈనెల 19న మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కనుమూరు సాయినాథరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. సాయినాథరెడ్డి యువ సేవాదళ్ సభ్యుడుగా ఉంటూ, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి తమకు మార్గదర్శకులుగా ఉండేవారని, ఆయన మరణం తమకు తీరని లోటని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాయిదర్బార్ మందిరం ఛైర్మెన్ మధుసాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మందిరం గౌరవ సలహాదారుల పాబోలు రామసుబ్బయ్య, బాబి సాయి, ట్రస్టు సభ్యులు పాల్గొని సమాజ సేవా భావంతో రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించారు.



ఇటీవల ప్రియదర్శిని కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లు, మానిటరింగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి.. కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

# కాశీవిశ్వనాథుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరు ఉస్మాన్ సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ – విశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వనాథ స్వామి దేవాలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామివార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి చంద్రప్రభ వాహనోత్సవాన్ని నేత్రపర్వంగా చేపట్టారు. ఐ.కృష్ణారెడ్డి–రామలక్ష్మమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ ఇఓలు దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కనుమరుగు ఖాయం



ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని, కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమికి 279 లోక్‌సభ సీట్లు వస్తాయని చెప్పడం హాస్యాస్పదమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ అన్నారు. ఈనెల 20న నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ దేశవ్యాప్తంగా అఖండవిజయం సాధించడం తథ్యమన్నారు. జూన్ 4న దేశప్రజలు కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడనున్నారని అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, బీజేపీ జిల్లా కార్యాలయ ఇన్‌ఛార్జి కె.ప్రసన్న, బీజేపీ నాయకులు సాయికుమార్, శ్రీనివాసులురెడ్డి, యువకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాల ఊపిరయ్య.. పుచ్చలపల్లి సుందరయ్య

## --- వర్ధంతి నాడు ఘనంగా నివాళి ---



భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఉద్యమాలకు ఊపిరులూదిన దివంగత నేత పుచ్చలపల్లి సుందరయ్య నేటితరానికి మార్గదర్శకమని, ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సుందరయ్య వర్ధంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 21న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెగా రక్తదానశిబిరాన్ని నిర్వహించి, సుందరయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందానీబాషా తదితరులు మాట్లాడుతూ, సుందరయ్య కమ్యూనిస్టు నాయకునిగా ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడారని, కార్మికరాజ్యం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఉద్యమస్ఫూర్తి అపూర్వమని అన్నారు. సీఐటీయు రూరల్ విభాగం కార్యదర్శి కిన్నెర కుమార్, అధ్యక్షుడు శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.






## సీనియర్ న్యాయవాది

# షకీల్ కన్నుమూత



సీనియర్ న్యాయవాది సయ్యద్ షకీల్ అహ్మద్ ఈ నెల 21న అనారోగ్యంతో కన్నుమూశారు. దాదాపు 30 ఏళ్లుగా ఆయన న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఆయన అకాలమరణం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, పి.సుందరయ్య యాదవ్, వైకాపా లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి ఆర్.రోజారెడ్డి తదితరులు సంతాపం ప్రకటించి, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. షకీల్ భౌతికకాయాన్ని పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు.

# సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ఉండాలి

## • విఎస్‌యు స్నాతకోత్సవంలో విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు



విద్యార్థులందరూ జీవితంలో నైతిక విలువలు పాటిస్తూ సమాజ హితం కోసం కృషిచేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఈనెల 22న వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) 8, 9 స్నాతకోత్సవ వేడుకలు గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి అబ్దుల్ నజీర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఈఎన్‌టి శస్త్ర చికిత్స నిపుణులు డా.ఇ.సి. వినయ్‌కుమార్‌కు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ నుంచి గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. యూనివర్శిటీ ప్రగతి నివేదిక, కార్యాచరణ ప్రణాళిక నివేదికను వైస్ ఛాన్సలర్ జి.ఎం.సుందరవల్లి వివరించారు. అనంతరం గాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, రీసెర్చ్ స్కాలర్లకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్‌ను గవర్నర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఆ లక్ష్యం నెరవేరేందుకు



సంకల్పం, పట్టుదలతో కృషి చేయాలన్నారు. మీరు సాధించిన డిగ్రీలు మీ వ్యక్తిగత యోగ్యతకు నిదర్శనమని, సమాజానికి సేవ చేయడానికి ఒక సోపానమని అన్నారు. గత పదిహేనేళ్లుగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సమాజానికి సేవ చేయడంలో విశేషమైన పురోగతిని సాధించిందని కొనియాడారు. అత్యుత్తమ న్యాక్ ఎ–గ్రేడును యూనివర్శిటీ పొందడం గర్వకారణమన్నారు. యూనివర్శిటీలో మౌలిక వసతులు బాగున్నాయని గవర్నర్ అభినందించారు.

## చరిత్రాత్మకమైనది.. నెల్లూరు సీమ

**డా. సతీష్‌రెడ్డి**



నెల్లూరు సీమ చరిత్రాత్మకమైనదని, ఈ నేలపైనే కవిబ్రహ్మ తిక్కన మహాభారతాన్ని ఆంధ్రీకరించారని, ఈ సీమలోనే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చదువుకున్నారని, భారతదేశ పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ సీమవారేనని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ శాస్త్రవేత్త, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, మన నెల్లూరీయుడైన డా.జి.సతీష్‌రెడ్డి అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీకి 'నాక్' సంస్థ ఏ–గ్రేడ్‌ను ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఈ యూనివర్సిటీ ఉన్నత విద్యలు అందించడంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని కొనియాడారు.

## 29 మందికి గోల్డ్‌మెడల్స్

**- వీసీ జిఎం సుందరవల్లి**

విక్రమ సింహపురి యూనివర్సిటీలో స్నాతకోత్సవం సందర్భంగా 29 మందికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా గోల్డ్ మెడల్స్ అందిస్తున్నట్లు విఎస్‌యు ఉపకులపతి జి.ఎం. సుందరవల్లి చెప్పారు. 275 మందికి డిగ్రీ పట్టాలు, పరోక్షంగా 3,301 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. విక్రమ సింహపురి యూనివర్సిటీకి నాక్ సంస్థ ఏ గ్రేడ్ ఇవ్వటం వల్ల యూనివర్సిటీలో అనేక రకమైన ఇంజనీరింగ్ కోర్సులు ఏర్పాటు చేయడానికి అవకాశం వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో యువతకు అవసరమైన మరిన్ని కోర్సులు ఏర్పాటుచేసి ఉన్నతమైన విద్యను అందించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జేఎస్ రెడ్డి సేవానిరతి మార్గదర్శకం

## • సంస్మరణ సభలో ప్రశంసించిన వక్తలు



ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజసేవాభిలాషి కీ.శే జేఎస్ రెడ్డి (జక్కా శ్రీనివాసులురెడ్డి) సేవానిరతి మార్గదర్శకమని, జిల్లాకు ఆయన చేసిన సేవలు, దాతృత్వం చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఈనెల 19న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన జేఎస్ సంస్మరణ సభలో జేఎస్‌రెడ్డికి ఆప్తమిత్రుడు, 'ఖైదీ' చిత్ర నిర్మాత డా. ఎం.తిరుపతిరెడ్డి, డా. ఏ.వి.సుబ్రహ్మణ్యం, వర్ధమాన సమాజం అధ్యక్షులు పొన్నాల రామసుబ్బారెడ్డి, రేబాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, ఎంఆర్ ప్రసాద్, అమరావతి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. నెల్లూరులో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి స్ఫూర్తిప్రదాతగా, చిల్డ్రన్స్‌పార్కు నిర్మాణ దాతగా, టౌన్‌హాలు ట్రస్టుబోర్డు కార్యదర్శిగా జేఎస్‌రెడ్డి చేసిన బహుముఖ సేవలు విస్మరించలేనివని వారు ప్రస్తుతించారు. తొలుత జేఎస్ కుటుంబసభ్యులు పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జేఎస్‌రెడ్డి ఆప్తులు, అభిమానులు, కళాకారులు, రాజకీయ, సాహిత్య, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

# డా. రేవూరికి.. 'రాళ్ళబండి' పురస్కారం



సుప్రసిద్ధ కవి, రచయిత.. 'ప్రసార భారతి' రిటైర్ట్ అదనపు డైరెక్టర్ జనరల్, మన నెల్లూరీయులు డా.రేవూరి అనంత పద్మనాభరావుకు దివంగత సాహితీవేత్త, ద్విశతావధాని రాళ్ళబండి కవితాప్రసాద్ స్మారక పురస్కారం లభించింది. ఈనెల 21వ తేది హనుమకొండలోని పిఆర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 'సహృదయ' సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు అధ్యక్షత్వంలో జరిగిన సభలో డా. రేవూరి ఈ పురస్కారం అందుకోవడం విశేషం. ఐసీహెచ్‌ఆర్ మాజీ అధ్యక్షుడు (న్యూఢిల్లీ) ఆచార్య యెల్లాప్రగడ సుదర్శనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. రేవూరి మాట్లాడుతూ సాహితీవేత్తలకు నిలయమైన ఓరుగల్లుతో తనకున్న అనుబంధం ఎంతో గొప్పదన్నారు. కాళోజీ, పేర్వారం జగన్నాథరావు, కవితాప్రసాద్‌ల వంటి సారస్వతవేత్తలతో తనకు ఆత్మీయ సంబంధాలున్నాయన్నారు. ఇక్కడ జరిగిన అనేక సాహితీ కార్యక్రమాల్లో తాను పాల్గొన్నానని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 'సహృదయ' సంస్థ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణమూర్తి, ఏ.జయశంకర్, ఏ.సదానందచారి, ఎం.కేదారి, వేదాంతం శ్రీదేవి, భాస్కర్, చక్రవర్తుల శ్రీనివాస్, జులూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అన్నదానం



నెల్లూరులోని చేపలమార్కెట్ సమీపంలో ఉన్న శ్రీ కావమ్మతల్లి గుడిలో ఈనెల19న పేదలకు అన్నదానం చేశారు. కావమ్మ–మారయ్య గుడి వార్షికోత్సవం సందర్భంగా, ఆ గుడి నిర్వాహకులు పి.పరంధామయ్య, పి.వేణు, అనూష, పురుషోత్తం, కళాధర్, పీవీ రమణయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.



# వైకాపా గెలిచి తీరుతుంది

## రామ్‌కుమార్‌రెడ్డి ధీమా



ఎంతమంది ఎన్ని సర్వేలు చేసినా, ఎన్ని ఊహాగానాలు చేసినా ఈ ఎన్నికల్లో వైకాపా గెలిచి తీరుతుందని వెంకటగిరి వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ప్రజలు వైకాపాను ఆదరిస్తున్నారని, సీఎం జగన్ పట్ల ప్రజల్లో ఎంతో అభిమానం ఉందని, వారి ఆదరణే తమ పార్టీని గెలిపిస్తుందని ఆయనన్నారు. త్వరలోనే జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో మళ్ళీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల సమయంలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు గెలుపు కోసం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ ప్రజలు ఆ హామీలను నమ్మకుండా వైయస్సార్సీపిని గెలిపించారని ఆయన తెలిపారు. అదేవిధంగా నేదురుమల్లి కుటుంబానికి సన్నిహిత సంబంధం ఉన్న గూడూరు నియోజకవర్గం, సూళ్లూరుపేట నియోజకవర్గం, వెంకటగిరి నియోజక వర్గాలలో కూడా వైయస్సార్సీపి అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని అన్నారు.

## నేత్రపర్వంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు



గూడూరులోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి దేవ స్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 20వతేదీన స్వామివారికి ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి హంస వాహనం నేత్రపర్వంగా జరిగాయి. ఈ నెల 18న ప్రారంభమైన ఈ బ్రహ్మోత్స వాలు 28వ తేదీ వరకు జరుగుతాయని, భక్తులు విచ్చేసి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని దేవస్థాన కమిటీ ఒక ప్రకటనలో కోరింది.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు



తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా వి.హర్షవర్ధన్ రాజు ఈ నెల 19వ తేదీన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడమే జిల్లా పోలీసుల ప్రధాన కర్తవ్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు, పాత్రి కేయులు, ప్రజాప్రతినిధులు తమవంతు బాధ్యతగా వ్యవహరించి పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా జరిపించడమే తన ప్రధానకర్తవ్యం అన్నారు. ముందుగా జిల్లా ఎస్పీకి అదనపు ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు.

## పోలీసుల కార్డన్‌సెర్చ్



గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీ, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్‌ను ఈ నెల 21న నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనాలు, ఆటోలను సీజ్ చేసి, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వ హించామని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. ఆయన వెంట సి.ఐలు రవికిరణ్, వేణుగోపాలరెడ్డి, ఎస్ఐలు మనోజ్, అంజిరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి శ్యామ్‌యాదవ్



గూడూరు శ్రీకృష్ణ సేవా సమితి వ్యవ స్థాపక అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ రొటేరియన్ డాక్టర్ బండి శ్యామ్‌సుందర రావు (మయూరి శ్యామ్‌యాదవ్)కి కోవిడ్ సమయంలో ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 'ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' వారి 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ప్రజాసేవా కార్యక్రమాలు చేస్తున్నానని, ఈ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, అదే సమయంలో మరింత బాధ్యతను కూడా పెంచిందని ఆయన అన్నారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రెసిడెంట్ నీలం, ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ నరేంద్రగౌడ్ లకు ఈసందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థినీవిద్యార్థులకు ఈనెల 26వ తేదీన నెల్లూరు నగరంలోని అపోలో ఆసుపత్రి ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు యాదవ ఎంప్లాయిర్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందని మయూరి శ్యామ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పదవ తరగతి ఫలితాలలో 475, ఆ పైన మార్కులు సాధించిన యాదవ విద్యార్థులు వారి మార్కుల లిస్టును 9948606664, 9705800794 నెంబర్లకు వాట్సప్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకా శాన్ని యాదవ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఈ నెల 26వ తేదీన ఉదయం 8 గంటలకు జరిగే ఈ ప్రతిభాపురస్కారాల కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయ వలసిందిగా ఆయన కోరారు.

# ఆలోచనలను రగిలించే.. 'వెలుగు మొయిలు'

'అజ్ఞానంతో తోటివారికి అన్యాయం చేస్తున్న మానవజాతికి లోలోపల ఆలోచన రగిలించే ఒక వెలుగు మొయిలు ఇప్పుడు కావాలి' అంటారు కవయిత్రి శశికళ తన్నీరు ఎంతో ఆర్తిగా! మానవజాతి అజ్ఞానంతో తోటివారికి అన్యాయం చేస్తుందనేది మనందరి భ్రమ మాత్రమే!

ఇప్పుడు చేస్తున్న అన్యాయం అజ్ఞానంతో కాదు, అహంకా రంతో, ఆధిపత్యంతో తాము బలవంతులమన్న విర్రవీగే మన స్తత్వంతోనన్నది మనం తెల్సుకోవాల్సి ఉంది. కవయిత్రి చేసిన విజ్ఞాపనతోనే ఆమె మెత్తటి హృదయం తొంగి చూస్తుంది. శశికళ కవిత్వంలో పదును తేలింది కాని హృదయం కూడా కరుకు దేలాలి. మానవ చరిత్రలోని అగాధాల్ని పాషాణమై పెళ్లగించి కవితాగ్నిని సృష్టించి పెళ్లగించాలి. అప్పుడే ఆ చితి నుంచి మంచి సమాజపు జాడ కనుక్కోగలమో లేదో వేచిచూడాలి!

ఆమె నూతన కవితా సంపుటి 'వెలుగు మొయిలు' విస్తారంగా 60 కవితలతో వెలువడింది. ఈమె తాను యాకూబ్ కవి సంగమం నుంచి ప్రాణం పోసుకున్న కవయిత్రిగా చెప్పడం ఆమె వినయ విశేషం. శశికళ కవితలు భావ పూర్ణతతో నిండి అభివ్యక్తి నవ్యతకు నిరంతరక్షపిని తేటతెల్లం చేస్తాయి ఈ కవితా సంపుటిలో! వస్తు వైవిధ్యంతో స్త్రీ వాద పోరాటం చేస్తూ సాగుతాయి కొన్ని కవితలు. శ్రీమతి సుశీలా నారా యణరెడ్డి ట్రస్టు పెట్టి పోటీలో నెగ్గి వారిచే ప్రచురణకు నోచుకున్న విదుషి శ్రీమతి శశికళ కావడం అభినందనీయం.



**వెలుగు మొయిలు**

**కవయిత్రి:**

**తన్నీరు (వాయుగుండ్ల) శశికళ**

**వెల: రూ. 100/-**

**ప్రతులకు:**

**తన్నీరు శశికళ**

**జి1, అంజనీ అపార్ట్‌మెంట్స్, పిచ్చిరెడ్డి తోపు, నాయుడుపేట, తిరుపతి జిల్లా - 524126.**

**సెల్: 9493914855, 9440745336**

తొలి కవిత 'మనసు భాష'లో ఆమె మనసు పరుగెత్తడాన్ని గాలి కంటే వేగం అని చెప్పానే హృదయం ఇప్పుడు మెట్రో స్టేషన్ అంటుంది. మనసుకు ఇప్పుడు ఆధునిక పరిభాషను అమర్చిన నేర్పరితనం ఆమెది.

'చెమట పరిమళాలు' కవిత 'స్త్రీగా తన్ను తాను భస్మం చేసుకొని వెలుగునిస్తున్న ఉష్ణపక్షిలా అలమటిస్తూ పరిమళించే స్త్రీత్వానికి కాసింత పరిమళం అద్దరాదా' అని సలహా ఇస్తారామె! ఆ చేతులకు శ్రమ పరిమళాల్ని అద్దడమే తెలుసు కాని, చేయిచాచి అడుక్కోవడం తెలీదు అని చెప్పడం స్త్రీల అభిమాన అభిజాత్యాలను కుప్పపోయడమే అవుతుంది. మహిళ కన్నా మానవీయత గల జీవి భూమిపై ఏముంది? ఆమె వాదన అత్యంత సమర్థనీయం అభిలషణీయమే కదా!

'నేనేమి చేస్తుంటాను' కవితలో తన భావం ఏమిటో చెప్తా రామె. పాత కథలు ఇప్పుడొద్దలెండి. చీలికలైన వస్త్రాన్ని ఆవలపడేసి ప్రేమ దారాలతో కొత్త లోకాన్ని నేయాలని అభిల షిస్తారామె. ఆమె నాటిన మానవతా బీజాలు అంకురించి మొలకెత్తడాన్ని సమాధుల్లో నుంచి చూసుకొని నవ్వుకొని ఆనంద పడ్తానంటారామె. తన భావ ముద్రను గాఢంగా చెప్పగల్గిన రచయిత్రిగా మనకు దర్శనమిస్తారామె ఈ కవితలో.

'నాలుకల చీలికల్లో చచ్చిన మనిషితనాన్ని చూడగానే ఒక్క సారిగా భగ్గుమన్న నా కలల ముక్కలను తిరిగి ఎలా పేర్చుకోను' అంటారామె ఓ 'ఎలా పేర్చుకోను?' కవితలో. మనిషి హృదయం దావానలమై మాటలు విష వలయాలుగా రోజుకో విధంగా, ఘడియకో విధంగా అంకురించడాన్ని ఇలా శిరచ్ఛేదనం చేసిన శశికళలోని కవన దార్శనికతకు సంకేతమిది.

గుప్పెడు కావ్యాలు రాసి శాలువాలు పరచిన దారుల్లో పయనించే కవిమిత్రులకు 'గర్జించే వాక్యం' ఓ హెచ్చరిక! అంత రాత్మను అమ్ముకున్నచోట చైతన్యజ్వాల ఎప్పటికీ రగలదంటా రామె. మసిపూసుకొన్న నీ హృదయం జాతినెప్పుడో మరచిపో యిందని చెప్తారు అన్యాపదేశంగా మూడు రంగులను మరచి పోయిందని చెప్తు! ఉరుకుల పరుగుల జీవితాన్ని 'శూన్యం' కవితలో ప్రశ్నిస్తారు శశికళ. ముద్దల పరుగులతో ఆకలి తీర్చుకుంటే ఎంత రుచిని కోల్పోతున్నావో తెలుసా అంటూనే 'ప్రేమరాహిత్యాన్ని' నింపిన నీ మనసు ఎంతో కోల్పోతుందని, నిరర్థకమని సెలవివ్వడం ఓ సందేశం.

'కొన్ని దాహాలు' కవితలో డబ్బు దాహం, కామదాహం, కీర్తి దాహం, కవితా దాహాలపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారామె. ప్రస్తుతానికి చిన్న దాహాలే అయినా విక్రమత్వాన్ని పొందుతాయి అని హెచ్చరిస్తారు.

ఆమె ఆంగ్లానువాద కవిత 'ఆమె కోసం' చాలా విభిన్నంగా ఉంది. 'ఆమె మెదడులో గడియారం తిరుగుతూనే ఉంటుంది' లాంటి కొత్త ప్రయోగాల్తో నిండి ఉండడం విశేషం. ఓ రచయిత అన్నట్లు స్త్రీలు చేసే సేవలన్నీ కలుపుకొంటే జిఎస్‌టి ఎంత చెల్లించాల్సి ఉంటుందో లెక్క కట్టలేం. ఆడపిల్లల పట్ల వివక్ష చూపే సమాజాన్ని 'రెండు ప్రేమకణాల నెత్తుటి గడ్డ కథ'లో ఎండగడ్తారామె. పురిటి ఆడపిల్లల కోసం చెత్తకుండీలు చేతులు చాచుకొని కూర్చొని ఉంటాయంటారు. ఆడపిల్లకు భూమి మీద కంటే మృత్యువు నీడ చల్లగా ఊయలలూపుతుంది అంటూ మహిళల దయనీయ పరిస్థితిని హృదయవిదారకంగా నినదించిన శైలి ఈమెది. 'నరం లేదా నాలుకకు' కవితలో స్త్రీత్వానికి విలువలేకపోతే 'మళ్ళీ నరకాసురవధ'కు ఉద్యుక్తులవుతాం అంటారు శశికళ.

ఆమె కవితల్లో ఓ ఆవేశం, ఓ సందేశం నిండి సమాజ ప్రక్షాళన పక్షాన నిల్చిన మహిళా దీపంలా వెల్గునిస్తుంది. కాసింత శీర్షికల నమోదులో కొంచెం జాగరూ కత అవసరమేమోనన్పిస్తుంది.

మొత్తానికి తన్నీరు శశికళ విశ్వ రూపం 'వెలుగు మొయిలు'గా ప్రతి బింబిస్తుంది.



**- చిన్ని నారాయణరావు**

**9440202942**



## శ్రీసిటీలో ఆకట్టుకున్న...
# 'సీతారాముల కల్యాణం' ఉపన్యాసం

శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక-శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన 'సీతారాముల కల్యాణం' ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధాన ఆచార్యులు, ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త కందాడై సెల్వన్ సీతారాముల కల్యాణం ప్రాముఖ్యత, గొప్పదనం గురించి వివరించారు. త్రేతాయుగం నుండి యుగయుగాలుగా అజరామరంగా కీర్తింపబడుతున్న సీతారామ కల్యాణ ఘట్టాన్ని, ఇతర పౌరాణిక వివాహ సన్నివేశాలతో పోల్చి చెప్పి, ఆయన తన ప్రసంగంతో భక్తులకు వీనులవిందు చేశారు. త్యాగరాజు, అన్నమయ్య, పోతన, కంబన్ వంటి కవులు సీతారామ కల్యాణ ఘట్టాన్ని తమదైన శైలిలో మనోహరంగా ఎలా వర్ణించారో సోదాహరణగా చెప్పారు. సీతారామ కళ్యాణ ఘట్టాన్ని ప్రస్తుత సామాజిక పరిస్థితులతో అన్వయిస్తూ, మారుతున్న పరిస్థితులు, నేటికాలంలో వస్తున్న విపరీత పోకడలను విశ్లేషించారు. మన ఇళ్లల్లో నిర్వహించే ప్రతి కళ్యాణం ఇకపై ఒక సీతారామ కల్యాణం కావాలని, త్వరలో ఆ రోజులు మళ్ళీ వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర గ్రామాలకు చెందిన పలువురు ఆధ్యాత్మిక సాహిత్యప్రియులు పాల్గొన్నారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ ప్రయోక్తగా వ్యవహరించారు.

# తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండి
## ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరి నారాయణన్



వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 20న నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ మండువేసవిలో జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో వేసవికాలం దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులలో ఎప్పటికప్పుడు నీటి నిల్వలను పరిశీలిస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని నిల్వ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లకు సూచించారు. నీటి నాణ్యతను కూడా పరీక్షించి, పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఫిర్యాదులను పరిష్కరించిన వెంటనే, ఆ సమస్య తెలిపిన వారికి ఫోన్ చేసి సమస్య పరిష్కారంపై వారి అభిప్రాయం తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఫిర్యాదుదారుతో ఒక ఫోటో తీసుకొని, ఉమ్మడి నివేదికను అందించాలని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఆ ట్యాంకర్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పనిచేయని బోర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో ఉన్న నీటి నిల్వల్లో జిల్లా ప్రజలకు తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉంచుకోవాలని, అందుకనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పబ్లిక్‌హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ శాఖల ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు సకాలంలో చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జడ్పీ సీఇవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డ్వామా పీడీ వెంకట్రావు, ఇరిగేషన్, తెలుగుగంగ ప్రాజెక్టు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కృష్ణమోహన్, రమణారెడ్డి, ఎస్.కె మర్దన్ అలీ, పబ్లిక్ హెల్త్ ఇఇ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.




విశ్వామిత్రుడిలో మదం, ఆ తరువాత కోపం, ఆ తరువాత అసూయ, అహంకారం, కామం... ఇలాంటి గుణాలన్నీ ప్రకటితమయి తానేం నష్టపోతున్నాడో వాటివల్ల గ్రహింపుకొచ్చి మరలమరల తపస్సు చేయసాగాడు! అంటే ప్రతిసారి Self Introspection..., Reconciliation.. చేసుకొని తనను తాను మెరుగు పరచుకొంటున్నాడు. ఇదే ప్రతిమనిషికి కావలసినది!

2) మన విశ్వానికి ఆవల ఎన్నో విశ్వాలున్నవి అని నేటి శాస్త్రవేత్తలు మొన్నమొన్ననే కనుక్కున్నట్లుగా చెపుతున్నారు.

కానీ మన విశ్వానికి ఆవల ఇంకొక విశ్వముండవచ్చు అనే భావన భారతీయులకు రామాయణం కాలం నాటికే ఉన్నది అని త్రిశంకువు కథ చెపుతుంది... ఇదీ భారతీయమంటే!

మనస్సు అనే పుట్టలో చుట్టలు చుట్టుకొని పడుకొన్న కామము అనే సర్పానికున్న కోరలు పీకి ప్రశాంతచిత్తుడై మరల తపస్సు మొదలుపెట్టాడు మహర్షి.

ఈయన తపస్సు మహోగ్రంగా పదివేల ఏళ్ళుసాగింది, ఈసారి రంభను పంపాడు దేవేంద్రుడు... తపస్సు భగ్నం చేయటానికి!

రంభ సౌందర్యానికి ఏ మాత్రం చలించక ఆమెను కోపంతో శపిస్తాడు.

వెనువెంటనే తన తప్పు తెలుసుకుంటాడు, అయ్యో క్రోధాన్ని జయించలేకపోతిని గదా! అని!

మరల తపస్సుకు పూనుకుంటాడు మహర్షి! ఇంకొక పదివేల ఏళ్ళు నిరాఘాటంగా సాగుతుంది, కాస్త విరామమిచ్చి భోజనం చేయాలని సంకల్పించుకొని భోజనం సిద్ధం చేసుకుంటాడు.

అన్నివేల ఏండ్ల తరువాత నకనకలాడే కడుపు పట్టెడన్నం కోరుతుంది.

దేవేంద్రుడు మరల బ్రాహ్మడి వేషంలో వచ్చి యాచిస్తాడు. మహర్షి మారు మాటాడక తనకై సిద్ధం చేసుకున్న ఆహారాన్ని ఆయనకు సంతోషంగా సమర్పించి! మరల తపస్సుకు కూర్చుంటాడు.

ఈసారి తపస్సు చేసినప్పుడు ఆయన శరీరం నుండి జ్వాలలెగసి పడి ముల్లోకాలను దహించివేయసాగాయి!

అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై "నీవు బ్రహ్మర్షివైనావు" అని పలుకగా.. ఆ మాటలు ఆయనకు తృప్తినివ్వవు! వశిష్ఠుడే వచ్చి ఆ విషయం చెప్పాలంటాడు.

అంత వశిష్ఠ మహర్షి అక్కడ ప్రత్యక్షమై ఆయనను బ్రహ్మర్షీ అని సంబోధిస్తాడు!

విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయినాడు!

- నవజాత శిశువు మనస్సు ఏవిధమైన మకిలి లేకుండా చాలా స్వచ్ఛంగా ఉంటుంది! ఎలాగంటే (ఇప్పటి తరాలకు తెలియదుగానీ) ఒక లాంతరు మొదట వెలిగించినప్పుడు దాని గ్లాసు స్వచ్ఛంగా ఉండి లాంతరు వెలుగు చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. సమయం గడుస్తూ ఉన్న కొద్దీ లాంతరు గ్లాసుకు మసి పడుతూ ఉంటుంది, దీపం లోపల అంతే వెలుగుతో ప్రకాశిస్తున్నా బయటకు మాత్రం తేజోహీనంగా కనపడుతుంది! దీపపు వెలుతురు సరిగా కనపడాలంటే ఎప్పటికప్పుడు గ్లాసు శుభ్రం చేయాల్సిందే.

అదే విధంగా శిశువు పెరిగి పెద్ద అయ్యే క్రమంలో మనసుకు ఎన్నో వాసనలు అంటించుకుంటాడు! మనిషి లౌకిక జీవనంలో తన మనస్సుకు అంటిన మకిలిని ఎప్పటికప్పుడు పూజ ద్వారా గానీ, ధ్యానం ద్వారా గానీ, మరింక ఇతరమైన ఏ పద్ధతులద్వారా అయినా సరే తొలగించుకుంటూ ఉండాలి. అలా తొలగించుకొని, మకిలిలేని మనస్సుకల ప్రతి మనిషి విశ్వానికి మిత్రుడు అవుతాడు, విశ్వామిత్రుడు అవుతాడు!

రామాయణంలోని విశ్వామిత్ర చరిత్ర మనకు చెప్పేది అదే అని నా ఉద్దేశం!

ఆ రోజంతా వారికి విశ్వామిత్రమహర్షి కథలే, అబ్బ ఎంత ఉత్తేజకరంగా ఉన్నాయవి! ఎందుకుండవు! ఒక సాధారణ రాజు, ఒక మనిషి! హిమాలయాలకన్నా ఎత్తు ఎదిగి మహామనీషిగా మారిన కథలు ఎవరికి స్ఫూర్తినివ్వవు? ఆ కథలలో మునిగితేలారు అన్నదమ్ములిద్దరూ శతానందులవారు తీయతీయగా చెబుతూవుంటే!.

తదుపరి రోజు విశ్వామిత్రమహర్షి రాకుమారులిరువురినీ వెంటపెట్టుకొని యాగశాలకు తీసుకువెళ్లాడు!

జనకుడిని చూసి, రాజా నీవద్ద చాలా గొప్పదైన శివధనుస్సు ఉన్నదటకదా! వీరిరువురకూ దానిని చూడాలని కుతూహలంగా ఉంది అని అడుగుతాడు!

సుర, అసుర, గరుడ, ఉరగ, కిన్నర, కింపురుషాదులు కూడా దానిని తాకి కదల్చలేకపోయినారు, అది సామాన్యమైన ధనుస్సుకాదని మీకు తెలుసు. ఈ ధనుస్సు మహాదేవుడు దక్షయజ్ఞమప్పుడు ఎక్కుపెట్టింది, దానిని దాచివుంచమని నిమిచక్రవర్తికి ఇవ్వగా, అటనుండి నాకు ముందు ఆరవతరమువాడైన దేవరాతుని వద్దకు చేరింది!

నేను ఒకప్పుడు యజ్ఞంనిమిత్తం భూమిని పరిశుద్ధం చేయాలని దున్నుచుండగా నాకు భూమియందు ఒక ఆడపిల్ల దొరికింది! ఆమె పేరు సీత! ఆవిడను వివాహమాడవలెనన్న, పరాక్రమమే శుల్కము! (వీర్యశుల్క). ఈ ధనుస్సు ఎక్కుపెట్టినవారినే ఆమె వరిస్తుంది!

ఎందరో మహావీరులైన రాజులు ఇప్పటిదాకా ప్రయత్నిస్తూనే ఉన్నారు! ఎక్కుపెట్టడం మాటదేవుడెరుగు కనీసం ముట్టుకొని కదల్చలేకపోయారు! అని జనకుడు పలికాడు.

బాలురవలె ఉన్న రామలక్ష్మణులను చూసి వీరు బాలురు,పైగా నరులు! వీరివల్ల సాధ్యమవుతుందా అని అనుమానపడ్డాడు!

అయినా విశ్వామిత్రమహర్షి కోరికను ఆదేశంగా స్వీకరించి ఆ దివ్యధనుస్సును సభకు తెప్పించాడు జనకుడు!

ఆ ధనుస్సు సామాన్యమైనదా!

పదివేల మంది మహాయోధులైనవారు లాగుతుండగా చక్రాలపెట్టెలో ఉంచిన ధనుస్సు సభాప్రాంగణానికి తేబడింది!.



ఆ ధనుస్సును మహర్షికి జనకుడు చూపగనే! విశ్వామిత్రుడు రామునితో నాయనా! ఇదిగో ఆ మహాధనుస్సు! దీనిని నీవు ఎక్కుపెట్టు! అని ఆదేశమివ్వగా దానిని శిరసావహించి శ్రీరాముడు ధనుస్సును సమీపించాడు!

ఆ ధనుస్సు ఎలావుందంటే!

చిరకాలము భూమినిమోసి అలసి నిద్రిస్తున్న మహానాగుడైన ఆదిశేషుడిలాగా ఉందట!

మేఘమండలంలోని కరిమబ్బులలోదాగిఉన్న మెరుపులాగ ఉందట!

రాముడు ధనుస్సును తాకబోతుంటే విశ్వామిత్రుడు శాంతివచనాలు చెపుతున్నాడు!

ఓ భూదేవీ నీవు అదరకు గుండెదిక్కబట్టుకో! రాముడు విల్లు ఎక్కుపెడుతున్నాడు!

ఓ శేషాహి(ఆదిశేషుడు) నీవు ఉలికిపడి కదలకు! రాముడు విల్లు ఎక్కుపెడుతున్నాడు!

ఓ దిగ్గజాలలార (దిక్కులను మోసే ఏనుగులు) మీరు బెదిరి చెదరకండి. రాముడు విల్లు ఎక్కుపెడుతున్నాడు!

ఓ లోకబాంధవుడా సూర్యుడా గడగడ వడకబోకు రాముడు విల్లు ఎక్కుపెడుతున్నాడు!

ఓ జంతుసంతతులారా జడిసిపోకండి! రాముడు విల్లు ఎక్కుపెడుతున్నాడు!

శ్రీ రామచంద్రమూర్తి ధనుస్సుకు భక్తిపూర్వకంగా ప్రదక్షిణ చేసి దానిమీద చేయి ఆన్చాడు!

లీలగా విల్లందుకున్నాడు. అవలీలగా ఎక్కుపెట్టాడు! అంతే ఒక్కసారిగా భూనభోంతరాళాలు దద్దరిల్లే శబ్దంతో ఫెళఫెళారావంతో విరిగిపోయింది!

**తస్యశబ్దో మహానాసీన్నిర్ఘాతసమనిస్వనః**
**భూమికమ్పశ్చ సుమహాన్ పర్వతస్యేవ దీర్యతః**

ఆ ధనుస్సు విరిగినప్పుడు పిడుగుధ్వనితో సమానమైన గొప్పశబ్దం వచ్చెనట, పర్వతాలు బ్రద్దలయితే భూమి ఎలా అదురుతుందో అలా అదిరిందట.

విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులు తప్ప తక్కినవారందరూ ఆ శబ్దానికి మూర్ఛపోయారట.

.. (సశేషం)

# ఫలితాలకు ముందే.. ప్రతీకారాలు!

(మొదటిపేజీ తరువాయి)

హత్యాయత్నం వరకు వెళ్లింది. నానిని రక్షించే క్రమంలో ప్రత్యర్థుల దాడిలో గాయపడిన నాని గన్‌మెన్ చివరికి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఇక్కడ కిరాయి మూకలు సమ్మెటలు, గడ్డపారలు, ఇనుప రాడ్‌లు తీసుకుని బహిరంగంగా రోడ్లలో వీరంగం చేయడం అక్కడ ప్రజలని భయ భ్రాంతులకి గురిచేసింది.

తాడిపర్తిలో పోటీచేసే అభ్యర్థుల పరస్పర ఛాలెంజ్‌లు, దాడులు ఇక ప్రతీ ఎన్నికలలోనూ సర్వసాధారణమే. ఈసారి కూడా అదే జరిగింది. అటు జేసీ సోదరుల అనుచరులు, కేతిరెడ్డి అనుయాయులు యధాతథంగా దాడులు చేసుకున్నారు. రెండు పార్టీల ప్రధాన నాయకులని పోలీసులు గృహనిర్బంధం చేసేవరకూ అన్ని చోట్లా పరిస్థితి అదుపులోకి రాలేదు. ఇక మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి పిచ్చి పీక్స్‌కి చేరిందనడానికి ఆలస్యంగా వెలుగుచూసిన వీడియో క్లిప్పింగే సాక్ష్యం. తన నియోజకవర్గ పరిధిలోని పాల్వాయి గేటు పోలింగు బూతులోకి నేరుగా వెళ్లి అక్కడ ఈవీఎంని ఆయనే స్వయంగా ఎత్తి నేలకేసి కొట్టారు. తాను ఒక శాసనసభ్యుడినన్న విచక్షణ కూడా ఆయన కోల్పోవడం గమనార్హం. ఆయనని అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంటుపై పిన్నెల్లి అనుచరులు దాడి చేశారు. అక్కడ పోలింగ్ అధికారులు మాత్రం చోద్యం చూస్తూ ఉండిపోయారు. ఈసారి ఎన్నికలలో రాష్ట్రంలో ఇంకా అనేకచోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. కేవలం తమ భవిష్యత్తుపై అభ్యర్థులలో ఏర్పడిన అనుమానాలు, అపోహలే ఈ దాడులకి ముఖ్య కారణమని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## ఆంధ్రలో భవిష్యత్తు రాజకీయాలకి అద్దం!

ఈ ఎన్నికలలో చెలరేగిన విధ్వంస కాండ, జరిగిన హింస చూస్తుంటే... ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్ రాజకీయాలు ఎలా వుండబోతున్నాయో స్పష్టమవుతోందంటున్నారు విశ్లేషకులు. గతంలో ఎప్పుడూ లేనట్లుగా తీర్పు రాకముందే నాయకులు ఓర్పును కోల్పోయారని, ఇది మంచి పరిణామం కాదని ఒక సీనియర్ రాజకీయవేత్త అభిప్రాయపడ్డారు.

## ఆగ్రహించిన ప్రధాన ఎన్నికల సంఘం!

ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న సంఘటనలపై ప్రధాన ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. చాలాచోట్ల అధికారులకు స్థానచలనం కలిగించింది. కొంతమందిని సస్పెండ్ చేసింది. జరిగిన అన్ని సంఘటనలపై దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని నియమించింది.

## కలవరపెడుతున్న కొత్త ట్రెండ్!

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సంఘటనలు రాజకీయవర్గాల్లో పెద్ద చర్చగా మారాయి. రాష్ట్ర రాజకీయాలలో కొత్త ట్రెండ్ మొదలయ్యిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రశాంత రాష్ట్రంగా పేరున్న ఆంధ్రాలో ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమని మేధావులు అంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రెండవ పార్టీ సహకారంతో అన్ని పార్టీల అధినేతలు, నాయకులు, శ్రేణులు సంయమనం పాటించి సుహృద్భావ వాతావరణంలో రాష్ట్ర పురోభివృద్ధికి పాటుపడాలి. అంతే తప్ప ఇలా పగలూ ప్రతీకారాలూ అంటూ దాడులకి, విధ్వంసాలకి తెగబడితే రాష్ట్రం తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, అభివృద్ధి కుంటుపడిపోతుందని తలపండిన రాజకీయ వాదులు హెచ్చరిస్తున్నారు!

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జి. నాగార్జునరెడ్డికి అనంతపురంలోని జెఎన్‌టి విశ్వవిద్యాలయం ఇటీవల డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఆప్టిమైజ్డ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఎర్లీ డయాగ్నొసిస్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్' అనే అంశంపై ఆయన పరిశోధన పత్రం సమర్పించారు. ఎన్‌బికెఆర్ ఇసిఇ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.కె.నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఈ పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. నాగార్జునరెడ్డికి డాక్టరేట్ లభించినందుకు ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి. విజయకుమార్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథరరెడ్డిలు అభినందించారు.

# పని ఒత్తిడి వల్లనే..రక్తపోటు సమస్య




పని ఒత్తిడి వల్లనే రక్తపోటు వంటి సమస్యలు వస్తుంటాయని, దానిని నివారించుకోవాలంటే ఆహారపు అలవాట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, అలాగే యోగా-వ్యాయామం వంటివి చేయడం వల్ల దీనిని తగ్గించుకోవచ్చని నారాయణ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా ఈనెల 22న జరిగిన 'వాకథాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్తపోటు పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, ఈ సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అధికశాతం మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారని, పనిఒత్తిడి తగ్గించుకుని ప్రశాంతంగా ఉంటే దీని నివారణ సాధ్యమని అన్నారు. నారాయణ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగం అధికాధిపతి డాక్టర్ చంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ ప్రభాకర్‌రాజు, అరుణ్‌కాంత్, ఏజీఎం శేఖర్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి, మమత తదితరులు పాల్గొన్నారు.






# గిరిజనులకు బిర్యానీ ప్యాకెట్లు

కావలిలోని హ్యాపీ సేవాసంస్థ ఈ నెల 20న కావలి రూరల్‌లోని ఆముదాలదిన్నె గ్రామంలో ఉన్న నిరుపేద గిరిజనులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. కావలి ఇస్లామ్‌పేటకు చెందిన దివంగత షేక్ బాబు జ్ఞాపకార్థం ఆయన కుమారులు షేక్ జానీబాషా, గౌస్‌బాషాల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా తెలిపారు. లోక్‌అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

# మితభాషి.. డాక్టర్ సీతారామయ్య

- డాక్టర్ సీఎంకెరెడ్డి



సంఘ సేవకులు గూడూరు సాంస్కృతిక సమ్మేళనం అధ్యక్షులు కందనూరు సీతారామయ్య స్మృత్యంజలి సభ ఈ నెల 21వ తేదీ చెన్నై నగరంలో జరిగింది. అక్కడి టి-నగర్ విజయరాఘవ రోడ్‌లోని ఆస్కా ప్రాంగణంలో 'వేదవిజ్ఞాన వేదిక' జేకేరెడ్డి నిర్వహిణలో జరిగిన కార్యక్రమంలో సీతారామయ్య కుమారులు కందనూరు మధు (వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి) డాక్టర్ శ్రీరామ్‌తో పాటు కుటుంబీకులు పలువురు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సీతారామయ్య చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సీఎంకెరెడ్డి ప్రసంగిస్తూ సీతారామయ్య మితభాషి అని, ఆయన స్ఫూర్తితో మొదటి కుమారుడు మధు 'వేదవిజ్ఞాన వేదిక' కార్యక్రమాల నిర్వహణలో, రెండో కుమారుడు శ్రీరామ్ వైద్య రంగంలోనూ గుర్తింపు పొందడం హర్షణీయమన్నారు. సీతారామయ్య వైద్యుడిగా మాత్రమే కాకుండా సంఘసేవకుడిగా తెలుగువారి సంస్కృతిని ప్రచారం చేస్తూ దేశ విదేశాల్లో విశిష్ట సేవలందించారని కొనియాడారు. గూడూరు రోటరీ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డి, సభ్యులు పి.వి.కృష్ణయ్య తదితరులు పాల్గొని అంజలి ఘటించారు. చెన్నైకి చెందిన ఏచూరి చలపతిరావు, ఏవీ శివకుమారి, రమేష్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# కామాక్షితాయి అమ్మవారికి బంగారు హారం



బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వెలసివున్న శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి కడపకి చెందిన భక్తురాలు హెచ్ శ్రీలక్ష్మి 63.160 గ్రాముల బరువున్న ఓ బంగారు హారాన్ని కానుకగా సమర్పించుకున్నారు. ఈనెల 22న ఆ హారాన్ని ఆలయ ఇఒ గిరికృష్ణకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివగంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి-అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు చేయించి ఆమెను ఆశీర్వదించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం గ్రామంలోని ఎంవిఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు.. 2003-04 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న వారంతా ఇటీవల ఆ పాఠశాలలో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తాము ఆ బడిలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని, పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. పాఠశాలకు తమ గుర్తుగా ఒక కంప్యూటర్‌ను అందజేశారు. పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు రామకృష్ణ, శ్రీనివాసులు, అలెగ్జాండర్, నాగరాజు, ప్రకాష్, వసుంధర, శారదాంబ, మురళి, పాండురంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# కోడూరు బీచ్‌లో.. యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు



వేసవి సెలవుల్లో సరదాగా కోడూరు బీచ్‌కు వెళ్ళి, సముద్రంలో ఈతకు దిగిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ లోతుకు వెళ్లిపోయాడు. కొద్ది సేపట్లోనే గల్లంతైపోయేవాడు. అదృష్టవశాత్తూ అక్కడే ఉన్న మెరైన్ పోలీసులు ఆవుల సంజీవి, కెవి శేష గిరిరావు గమనించి వెంటనే సముద్రంలోకి దిగి లైఫ్‌బాయ్‌తో కలిసి, ఒడ్డుకు చేర్చడంతో ఆ యువకుడి ప్రాణాలు నిలబడ్డాయి. ఈనెల 18న ఈ సంఘటన జరిగింది. నీళ్లు మింగేసి ప్రాణాపాయస్థితికి చేరిన ఆ యువకుడికి పోలీసులు ప్రథమ చికిత్స చేసి, వైద్యశాలకు తరలించడంతో ఎట్టకేలకు సురక్షితంగా బయటపడ్డాడు. నెల్లూరు డైకస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన జానీ, తన స్నేహితులతో కలిసి బీచ్‌లో సముద్రస్నానం చేస్తుండగా జానీ ఉన్నట్లుండి నీటిలో మునిగిపోవడంతో స్నేహితులు ఆందోళన చెందారు. సముద్రస్నానానికి వచ్చేవారు అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదమని మెరైన్ పోలీసులు పర్యాటకులకు చెప్పారు. యువకుడి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులను పర్యాటకులు అభినందించారు.

# తడ రైల్వేస్టేషన్ నుండి.. కొబెల్కో క్రేన్ల రవాణా

## • పరిశ్రమలకు ఊతమిస్తూ ప్రత్యేక రైలు రవాణా సదుపాయం




శ్రీసిటీలోని కొబెల్కో ఇండియా సంస్థ, ఈనెల 20న తమ పరిశ్రమ ఉత్పత్తులైన భారీ ఎక్స్‌కవేటర్లను (మట్టి తవ్వే యంత్రం) తడ రైల్వే స్టేషన్ నుండి రైలులో రాజస్థాన్‌లోని జైపూర్‌కు రవాణా చేసింది. ఇది తడ రైల్వే స్టేషన్ నుండి "మేడ్ ఏ శ్రీసిటీ" పారిశ్రామిక ఉత్పత్తుల మొట్టమొదటి రైలు రవాణా కావడం విశేషం. తమ మొదటి రవాణాలో 35 ఎక్స్‌కవేటర్లను కొబెల్కో సంస్థ తరలించడం ఇదే తొలిసారి. ఉత్తర భారతదేశానికి రైలు రవాణా దిశగా పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా తమ భారీ వాహనాల రవాణాకు ఈ సదుపాయాన్ని ఎంచుకున్నట్లు ఈ సందర్భంగా కొబెల్కో ప్రతినిధి పేర్కొన్నారు. దీంతో పాటు, ఈ రైలు రవాణా ద్వారా 20 శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందని, ఇంకా, ట్రక్కుల ద్వారా చేసే రోడ్డు రవాణాతో పోలిస్తే ఈ పద్ధతి కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుందని ఆయన చెప్పారు. తడ రైలు రవాణా సేవలపై శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ రవాణా కోసం తడ స్టేషన్‌లో మెరుగైన కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలు, కంటైనర్ జోన్, మెరుగైన మౌళిక సదుపాయాలను రైల్వేశాఖ కల్పించాలని ఆయన కోరారు. ఇది వ్యాపార అవసరాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా, రైల్వే శాఖకు గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చుతుందని కూడా ఆయన తెలిపారు. తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులను రవాణా చేయడానికి శ్రీసిటీ మరియు పరిసర ప్రాంతాల పరిశ్రమలకు ఇది అత్యంత ప్రయోజనకరమైన సదుపాయంగా ఆయన వ్యాఖ్యానించారు. తడ రైల్వే స్టేషన్ నుండి రవాణా సదుపాయం పట్ల శ్రీసిటీ పరిశ్రమవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. శ్రీసిటీకి అత్యంత సమీపంలో తడ స్టేషన్ ఉండడం వలన రవాణా ఖర్చు, సమయం వీరికి ఆదా అవుతున్నాయి. అంతేకాక, దేశంలోని పలు ప్రధాన నగరాలు, ఓడరేవులకు ఈ స్టేషన్ అనుసంధానం కావడంతో శ్రీసిటీ పరిశ్రమల మార్కెట్ పరిధి మరింత విస్తరించనుందని శ్రీసిటీ వర్గాలు భావిస్తున్నాయి.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న రామ్



చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో ఉన్న ప్రసిద్ధ క్షేత్రం.. శ్రీ వల్లీ దేవసేన సమేత స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాన్ని ఈనెల 20న వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి ఎమ్మెల్యే అభ్యర్థి.. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ సిబ్బంది, చిట్టమూరు మండల వైకాపా నాయకులు ఘనంగా స్వాగతించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

## విద్యార్థులకు జేవీవీ ప్రతిభా పురస్కారాలు



కావలి పట్టణంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కావలి జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) వారు ఇటీవల ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కావలిలోని రవి నర్సింగ్‌హోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుల డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ ఎస్.మనోహర్‌బాబు, డాక్టర్ పీవీ శివప్రసాద్‌లు పాల్గొని విద్యార్థులకు ఆ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆ 11 పాఠశాలలన్నిటిలో అత్యధిక మార్కులు కైవశం చేసుకున్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని నీరజకు నిర్వాహకులు ఈ సందర్భంగా పూలమొక్కలు అందజేసి అభినందించారు. జేవీవీ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి హరనాథ్, టి.సుబ్బరాయశర్మ, జి.కల్యాణి, సి.శారద, ఎస్‌కె ఖాదర్‌బాషా, ఎంవిఎస్ ప్రసాద్‌రావు, మండవ వెంకటరమణయ్య, ఎస్‌కె జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో రక్తదానం




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ రక్తనిధిలో ఈనెల 20న రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ రక్తదానం చేశారు. ఇప్పటి వరకు 49సార్లు స్వచ్ఛందంగా ఆయన రక్తదానం చేసి ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరు సంవత్సరంలో నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని, ఒక్కరు చేసే రక్తదానం వలన ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. కృత్రిమంగా రక్తం తయారు చేయలేమని, అందువల్ల అత్యవసర పరిస్థితులలో బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తూ వారి కుటుంబసభ్యులను, బంధువులను, స్నేహితులను రక్తదానం చేయవలసిందిగా ప్రోత్సహించాలని ఆయన కోరారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు రెడ్ క్రాస్ రక్తనిధిలో వారి పేర్లను నమోదు చేసుకొని అత్యవసర పరిస్థితులలో రక్తదానం చేయుటకు సంసిద్ధముగా ఉండవలసిందిగా అభ్యర్థించారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి పి.మస్తానయ్య, స్పాస్టిక్ సెంటర్ కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొని 49 సార్లు రక్తదానం చేసిన దాసరి రాజేంద్రప్రసాద్ సేవాభావాన్ని కొనియాడారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని, ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు నగర సబ్‌డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్-30 అమల్లో ఉందని, శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించాలని ప్రయత్నిస్తే కఠినచర్యలు తప్పవని నగర డిఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి మే 20న ఒక ప్రకటనలో హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉంది కనుక రాజకీయపార్టీలు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలు చేయకూడదని ఈ సందర్భంగా ఆయన పెట్రోలు బంక్‌ల నిర్వాహకులకు సూచించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా, నెల్లూరు రూరల్ సబ్‌డివిజన్ పరిధిలోని వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు రూరల్, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ యాక్ట్-30 అమలులో ఉందని నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## తప్పిపోయిన బాలికను రక్షించిన మెరైన్ పోలీసులు

ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్ వద్ద సముద్రస్నానానికి వచ్చి, బీచ్ వద్ద జనం రద్దీలో తమ కుమార్తె తప్పిపోవడంతో తల్లితండ్రులు ఆందోళనతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మెరైన్ పోలీసులు రంగంలోకి దిగి ఆ అయిదేళ్ళ చిన్నారి కోసం గాలించారు. ఓచోట వంటరిగా కూర్చుని ఉన్న పాపను గుర్తించి తల్లితండ్రులకు అప్పగించడంతో, బీచ్‌వద్ద ఉన్న పర్యాటకులు మెరైన్ పోలీసుల అభినందించారు. బీచ్‌కు వచ్చినప్పుడు తల్లితండ్రులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని వారు ఈ సందర్భంగా పర్యాటకులకు సూచించారు.

## టూకీగా...



### గ్రామదేవత సత్యమ్మతల్లికి విశేష పూజలు

కలువాయి మండలం తోపుగుంటలోని గ్రామశక్తి శ్రీ సత్యమ్మ అమ్మవారికి కొత్త ఆలయం కట్టి 41 రోజులైన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 19న ఆలయంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయ కర్తలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### బుచ్చిలో పారిశుద్ధ్య కార్మికులకు తేనేటి విందు

ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద పరిశుభ్రతను పరిరక్షించినందుకు బుచ్చి నగర పంచాయతీలోని పారిశుద్ధ్య సిబ్బంది అధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఆ పచాయతి కమిషనర్ వారిని అభినందిస్తూ తేనేటి విందు ఏర్పాటుచేసి వారి సేవలను అభినందించారు.

### అల్లూరు చెరువులో అక్రమంగా చేపల వేట

అల్లూరు చెరువును ఇటీవల మత్స్యశాఖ అధికారులు ఎం.నాగేశ్వరరావు, టి.శ్రీనివాసులు సందర్శించి, చెరువులో అక్రమంగా చేపలు పడుతున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. అక్రమ వేట జరగకుండా పర్యవేక్షించేందుకు చెరువు చుట్టుపక్కలా మత్స్యశాఖ సిబ్బందిని పర్యవేక్షకులుగా నియమించారు.

### పబ్బులేటిపల్లిలో పిడుగుపాటు.. గేదె మృతి

సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో ఈనెల 19న భారీవర్షాలు కురిశాయి. పిడుగు పడి, రైతు రామయ్యకు చెందిన గేదె అక్కడికక్కడే మృతిచెందడంతో, ఆ రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. గేదె మృతితో నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

### జట్లకొండూరు గ్రామసభలో సమస్యలపై సమీక్ష

మనుబోలు మండలం జట్లకొండూరు గ్రామసభ ఈనెల 20న జరిగింది. సర్పంచ్ కె.నాగమ్మ ఆధ్వర్యంలో, ఉప సర్పంచ్ తులసిరామ్‌యాదవ్ తదితరులు పాల్గొని గ్రామంలో మంచినీటి సమస్య, విద్యుత్‌దీపాలు, పారిశుద్ధ్య పరిస్థితులపై సమీక్షించారు. గ్రామస్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. పంచాయతి సెక్రటరీ వెంకటరమణ పాల్గొన్నారు.

### తుమ్మూరులో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నాయుడుపేట పట్టణ పరిధిలోని తుమ్మూరులో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలకు ఈనెల 20న అంకురార్పణ జరిగింది. టీటీడీ వేదపండితులు వచ్చి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. టీటీడీ డెప్యూటి ఇఓ దేవేంద్రబాబు, ఏఇఓ కె.సుబ్బరాజు, సూపరింటెండెంట్ డి.శ్రీనివాసులు, హరిరెడ్డి, సుధీర్ పర్యవేక్షించారు.

### సైదాపురంలో రైతులకు అవగాహన సదస్సు

భూసార పరిరక్షణపై ఈనెల 20న సైదాపురంలోని రైతులకు మండల వ్యవసాయాధికారి హైమవతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. భూమిలోని పోషకాలను పెంచి నేలను సారవంతం చేసుకోవాలని, పచ్చిరొట్ట విత్తనాలు వేయడం ద్వారా పంటల దిగుబడులు పెరుగుతాయని ఆమె రైతులకు సూచించారు.

### మనుబోలులో విద్యార్థులకు యోగా శిక్షణ

మనుబోలు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఈనెల 21న ప్రముఖ యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు యోగా పట్ల అవగాహన కలిగించి, యోగాసనాలు వేయడం ఎలాగో నేర్పించారు. అనంతరం, లైబ్రేరియనన్ అరుణ్‌కుమార్ క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు.

### కోవూరు కోదండరామయ్యకు బ్రహ్మోత్సవాలు

కోవూరు గాంధీపార్కు కూడలిలో ఉన్న శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల ప్రారంభసూచకంగా ఈనెల 19న ధ్వజారోహణ జరిగింది. ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో మాజీ సీడీసీ ఛైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ మాజీఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు పాల్గొని పూజలు ప్రారంభించారు.

# అడుగడుగో.. చందమామ!

- అద్భుతంగా చంద్రుడి ఫోటోలు
- అబ్బురపరుస్తున్న ప్రతిమేష్ ప్రతిభ



ఓర్పు–నేర్పు ఉండాలే కానీ సాధించ లేనిదేమీ ఉండదని పూణేకి చెందిన ప్రతిమేష్ జూజు అనే ఓ పదహారేళ్ళ కుర్రాడు నిరూపించాడు. అందాల చందమామను ఫోటోలోకి చిక్కించుకున్నాడు. ఇంతవరకు మనం చాలాసార్లు చందమామ ఫోటోలను చూస్తుంటాం కానీ, వాటిని పెద్దవి చేస్తే స్పష్టత ఉండేది కాదు. అయితే, చందమామ ఫోటోలను హై రెజల్యూషన్‌తో బాగా కనిపించేవిధంగా తీసి ప్రపంచాన్నే అబ్బురపరుస్తున్నాడు ప్రతిమేష్. ఇప్పటివరకు ఇంత స్పష్టంగా చంద్రుడిని మరెవరూ ఫోటోలు తీయలేదంటూ అందరూ ఆ కుర్రాడి ప్రతిభను ప్రశంసిస్తున్నారు కూడా. ఆ ఫోటోలను చూస్తే, నిజంగానే చందమామను చాలా దగ్గరనుంచి చూస్తున్న అనుభూతి కలుగుతుందని అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు సైతం అభినందిస్తున్నారంటే ప్రతిమేష్ ప్రతిభ ఎంత గొప్పదో అర్థమవుతుంది. భూమి మీదనుంచి చంద్రుని ఫోటోలను ఇంత స్పష్టంగా తీయడమంటే మాటలు కాదు కదా!. అయితే ప్రతిమేష్ ఎంతో శ్రమతో టెలిస్కోప్, స్కై వాచర్‌తో పాటు



సొంతంగా తయారుచేసుకున్న మరికొన్ని పరికరాల సాయంతో ఈ అద్భుతాన్ని సృష్టించి అందరి అభినందనలు అందుకుంటున్నాడు. తాను ఈ నెలలో ఓ అర్థ రాత్రి.. ఒంటి గంట సమయంలో చంద్రుడిని ఫోటో తీసినట్లు ప్రతిమేష్ చెప్తున్నాడు. ఇక్కడ విశేషమేమిటంటే, ఎంత జూమ్ చేసినా ఎలాంటి బ్లర్ (మసక) లేకుండా చంద్రుడి స్వరూపం స్పష్టంగా కనపడేలా తీయడం. నెట్‌లో ఇప్పుడు ఆ ఫోటోలు ప్రపంచాన్నే షేక్ చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.






# అంతరిక్షంలోకి.. మన తెలుగోడు

మన తెలుగోడు అసాధ్యుడనిపించాడు. రాకెట్ అంటే ఏమాత్రం భయం లేకుండా, రివ్వుమంటూ అంతరిక్షంలో చక్కర్లు కొట్టివచ్చాడు. అంతరిక్షంలోకి వెళ్ళొచ్చిన తొలి భారత పర్యాటకునిగా రికార్డు సృష్టించాడు. ఆయన మరెవరో కాదు.. విజయవాడకి చెందిన తోటకూర గోపి. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నాడు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్ సంస్థ రూపొందించిన న్యూ షెపర్డ్–25 వ్యోమనౌకలో గోపీ ఈ యాత్ర దిగ్విజయంగా పూర్తిచేయడం తెలుగువారికి గర్వకారణం. గోపి అమెరికాలో ఉంటున్నప్పటికీ ఆయన స్వస్థలం విజయవాడ. ఎంబ్రీ రిడిల్ ఏరోనాటికల్ యూనివర్శిటీ నుంచి ఏరోనాటికల్ సైన్స్‌లో బీఎస్సీ పూర్తిచేసి, ప్రస్తుతం అట్లాంటాలోని 'ప్రిజర్వ్ లైఫ్' సంస్థకు సహ వ్యవస్థాపకునిగా ఉన్నారు. పైలట్‌గా కూడా శిక్షణ పొందాడు. ఏదేమైనప్పటికీ, గోపి రోదసియాత్ర తెలుగు ప్రజలకు ఎంతో సంతోషాన్నిచ్చింది.

# వెలుగులు విరజిమ్ముతూ.. భూమిపై రాలిన 'ఉల్క'

ఇటీవల ఓ పెద్ద రాకాసి ఉల్క భూమిపై పడింది. రాత్రివేళ పడిన ఆ ఉల్క ఆ సమయంలో వెలుగులు విరజిమ్ముతూ చీకటిని వెలుతురుమయంగా చేసింది. దీంతో రాత్రే పగలుగా కనిపించింది. ఈ విచిత్రం ఈనెల 19న స్పెయిన్–పోర్చుగల్ గగనసీమలో ఆవిష్కృతమైంది. అత్యంత దేదీప్యమానంగా ఉండే ఈ ఉల్క వెలుగు దాదాపు కొన్ని వందల కిలోమీటర్ల దూరం కనిపించిందని కూడా అంటున్నారు. నెట్టింట అందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారి ప్రజలను సంభ్రమాశ్చర్యాలను కలుగజేస్తున్నాయి. ఈ ఉల్క బహుశా క్యాస్ట్రోడైరో ప్రాంతాలో పడివుండవచ్చని కూడా భావిస్తున్నారు.






## సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

**పూండ్ల చెంచురెడ్డి గారు**

పరమపదించి తేది. 27.05.24 నాటికి
ముప్పైఆరు సంవత్సరాలు నిండుతాయి.

ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి
మరియు
కుటుంబసభ్యులు


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com